J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 27.12.2019, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 30 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

● ఆయన విజన్ 2020

## నేడు ఆయన పరిస్థితి ఏంటి?

- నాడు తండ్రి... నేడు తనయుడు
- వీరిద్దరి దెబ్బకి జీరోగా మారిన చంద్రబాబు నాయుడు



*విజన్ 2020... ఇది చదవగానే ఎవరికైనా ఇట్టే గుర్తొచ్చే నాయకుడు చంద్రబాబు నాయుడు. 2020 సంవత్సరం నాటికి ఆయన ఆంధ్రప్రదేశ్ ఇలా వుంటుందనే ఒక విజన్‌ను 1999లోనే రూపొందించుకున్నాడు. కాని, ఆయన కన్న కలలు వేరు... ఇక్కడ జరిగింది వేరు. 2020 నాటికి విభజన మూలంగా రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలా మారింది. అంతేకాదు, ఆయన రాజకీయ భవిష్యత్ కూడా గాఢాంధకారంలో వుంది. 2020 నాటికి ఆయన ఏదో అవుతుందనుకుంటే, ఇక్కడ ఇంకోటి అయ్యింది.*

*మొత్తానికి బాబు కలలుకన్న 2020 రానే వచ్చింది, కానీ ఆయన మాత్రం తన 'విజన్' కోల్పోయి... 'నా పరిస్థితి ఏంటి...?' అనే స్థితికొచ్చాడు.*

(మిగతా 10వ పేజీలో)




● అందరి నోట

## వికేంద్రీకరణ మాట

- జగన్ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు
- అన్ని ప్రాంతాల అభివృద్ధే ఆకాంక్ష



**రాష్ట్రానికి మూడు రాజధానుల నిర్ణయంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పాటించిన అభివృద్ధి వికేంద్రీకరణ మార్గం అందరికీ ఆమోదయోగ్య మంత్రంగా మారింది. దీనిని మెజార్టీ ప్రజల నుండే కాదు, విపక్షాలు, మేధావులు, వివిధ వర్గాల ప్రముఖుల నుండి సైతం మద్దతు లభిస్తోంది.**

అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలన్న దానిని భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యానాయుడు సమర్ధించారు. అన్నీ ఒకేచోట పెడితే హైదరాబాద్‌లాంటి పరిస్థితి పునరావృతమవుతుందని, అప్పుడు మిగిలిన ప్రాంతాల వాళ్ళు బాధపడాల్సి వస్తుందని ఆయన అభిప్రాయం. అలాగే మూడు రాజధానుల నిర్ణయం మంచిదేనని, అన్ని ప్రాంతాలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం ఆహ్వానించదగ్గ పరిణామమంటూ మెగాస్టార్ చిరంజీవి తన సంఘీభావం తెలిపాడు. అభివృద్ధి వికేంద్రీకరణ నిర్ణయానికి

(మిగతా 10వ పేజీలో)



● అమరావతికి దుర్గతి

## అంతా బాబే చేశాడు!

- ఐదేళ్ళ పాలనా కాలంలో చంద్రబాబు నాన్నుడే రాజధాని మార్పుకు నాంది అయ్యింది
- మూడు రాజధానులపై అమరావతి గ్రామాల్లో తప్పితే రాష్ట్రంలో ఎక్కడా కనిపించని వ్యతిరేకత

ఈరోజు అమరావతి ప్రాంతంలోని కొందరు రైతులు ఆందోళన చేస్తున్నారు. రోడ్ల మీద ధర్నాలకు దిగుతున్నారు. అమరావతిలో రాజధాని లేకుండా చేస్తున్నాడంటూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి శాపనార్థాలు పెడుతున్నారు. ఆయనను తిట్టిపోసుకుంటున్నారు. సీఎంపై కులపైత్యంతో నిప్పులు కక్కుతున్నారు. అసలు వీళ్లంతా నిప్పులు కక్కాల్సింది ఎవరి మీద? శాపనార్థాలు పెట్టాల్సింది ఎవరికి? ధర్నాలు, ఆందోళనలు చేయాల్సింది ఎవరికి వ్యతిరేకంగా?

(మిగతా 10వ పేజీలో)



# విలక్షణమైన వ్యక్తిత్వం 'విజయ' సొంతం

## డీసీసీబీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి అభినందన సభలో నేతలు



సోదరుడు ఆనం వివేకా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆనం విజయ, పక్కన రామనారాయణరెడ్డి, మయూర్‌రెడ్డి



డిసిసిబి ఛైర్మెన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

విలక్షణమైన వ్యక్తిగా, ముక్కుసూటి మనిషిగా, మాట తప్పని నేతగా ఆనం విజయకుమార్‌రెడ్డి ప్రజల్లో గుర్తింపు పొందాడని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆనం విజయకుమార్‌రెడ్డి అభినందన సభ ఈ నెల 22వ తేదీన నెల్లూరులోని డిసిసిబి ప్రాంగణంలో జరిగింది. ఈ సభకు వైసిపి కార్యకర్తలతో పాటు ఆనం కుటుంబ అభిమానులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి, శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, కిలివేటి సంజీవయ్య, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైసిపి నాయకులు మేరిగ మురళి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, పి.రూప్‌కుమార్‌యాదవ్, చాట్ల నరసింహారావు, శ్యాంసుందర్ రెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మొయిళ్ళ గౌరి తదితరులు పాల్గొన్నారు. సభలో ప్రసంగించిన నాయకులు ముఖ్యంగా ఆనం విజయకుమార్‌రెడ్డి వ్యక్తిత్వాన్ని కొనియాడారు. పార్టీ కష్టకాలంలో తాను ఓడిపోతానని తెలిసినా పార్టీ కోసం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసిన ధీరోధాత్తుడిగా విజయకుమార్‌రెడ్డిని మంత్రి అనిల్ అభివర్ణిస్తే, విజయకుమార్‌రెడ్డిని చట్టసభలలో శాసనమండలి సభ్యుడిగా చూడాలని వుందంటూ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన అభిప్రాయం చెప్పాడు. తాను సర్వేపల్లి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నప్పటి నుండి ఆనం విజయకుమార్‌రెడ్డితో కలిసి సాగించిన ప్రయాణాన్ని ఆదాల ప్రభాకర్‌రెడ్డి గుర్తు చేసుకున్నాడు.

అభినందన సభకు ముందు ఆనం విజయకుమార్‌రెడ్డి ముందుగా రామలింగాపురం సెంటర్‌లోని తన తండ్రి స్వర్గీయ ఆనం వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాడు. అనంతరం ఏసిసెంటర్‌కు చేరుకుని ఏసి సుబ్బారెడ్డి విగ్రహం వద్ద, అక్కడి కార్యాలయంలో సోదరుడు స్వర్గీయ ఆనం వివేకానంద రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించాడు. అక్కడ నుండి ర్యాలీగా బయలుదేరి అట్టహాసంగా బ్యాంకు ప్రాంగణానికి చేరుకున్నాడు.

# రైతులను చైతన్యపరచండి

## - వ్యవసాయాధికారులకు కలెక్టర్ సూచన



జిల్లాలోని ప్రతి రైతును కలిసి అధిక దిగుబడులపై వారిని చైతన్యపరచాలని జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు జిల్లా వ్యవసాయాధికారులకు సూచించారు. 23వ తేదీన ఆయన నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో జిల్లా సమన్వయకర్త శ్రీమతి లలిత శివజ్యోతితో కలిసి వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, శాస్త్రవేత్తలు సరైన సమయంలో రైతులకు సరైన సలహాలు అందించినప్పుడే మంచి ఫలితాలుంటాయన్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు అధికంగా వాడడం వల్ల కలిగే నష్టాలను రైతులకు తెలియజేసి, సేంద్రీయ ఎరువుల వాడకం వైపు రైతులు మొగ్గుచూపేలా కృషి చేయాలన్నారు. వ్యవసాయానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ డి.డి ప్రసాద్‌రావు, రైతు శిక్షణా కేంద్రం డి.డి శివనారాయణ, ఆత్మ డి.డి సత్యవాణి, వ్యవసాయశాఖ ఏ.డి ధనుంజయరెడ్డి, శాస్త్రవేత్తలు పుల్లమరాజు, సంధ్య, నారాయణస్వామి, హరిప్రసాద్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

# కమనీయం.. హరిహరుల కళ్యాణాలు



కనువిందుగా శ్రీవారి పుష్పయాగం

తిరుమల తిరుపతి దేవస్థానము, హిందూ ధర్మ ప్రచార పరిషత్, శ్రీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవ సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరులోని రంగనాయకుల పేట సోమిశెట్టి కళ్యాణ మండపంలో ఈనెల22న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మేళతాళాలతో, మంగళవాయిద్యాలతో, భక్తుల గోవిందనామ స్మరణలతో కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించారు. అదే విధంగా శ్రీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవ సేవాసమితి ఆధ్వర్యంలో ఈనెల 23న శివపార్వతుల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివియస్ వినోద్ సంగీత కచేరీ, కళాదీప్తి డాన్స్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో కమిటీ నిర్వాహకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, కొండా బలరామిరెడ్డి, 'కళాదీప్తి' సుబ్రహ్మణ్యం, కర్ణ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త సంవత్సర వేడుకలకు

# ఆడంబరం వద్దంటున్న ప్రసన్న



నూతన సంవత్సర వేడుకలను నిరాడంబరంగా జరుపుకుందామని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పిలుపునిచ్చాడు. కొత్త సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి తనను కలవడానికి వచ్చే వాళ్ళు కేకులు, స్వీట్‌బాక్సులు, బొకేలు, పూలదండలు, శాలువాలు తేవొద్దని, ఆడంబరాలకు దూరంగా వుందా మంటున్నాడు. ప్రసన్న నిర్ణయం మంచిదేగా!

# ఆకట్టుకున్న భాగవతోపన్యాసాలు



సత్కారాన్నందుకుంటున్న అగస్త్యరాజు సుబ్బారావు

ప్రశస్త్యమైన ధనుర్మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు బాలాజీనగర్‌లోని శ్రీ సీతా రామస్వామి మందిరంలో ఈనెల 18 నుంచి 24వ తేది వరకు ఏడు రోజుల పాటు 'శ్రీకృష్ణ లీలా విభూతి' పేరుతో నిర్వహించిన భాగవతోపన్యాసాలు భక్తులందరినీ బాగా ఆకట్టుకున్నాయి. ఇనమడుగు శ్రీ సత్యానందాశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరితీర్థ స్వామీజీ ఆశీస్సులతో, పద్య సారస్వత పరిషత్ నెల్లూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 18న విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు 'బాలకృష్ణుడు' అనే అంశంపై ఉపన్యసించి సత్కారాన్నందుకున్నారు.

సింహపురి సమాచారం

అదేవిధంగా 19న అవధాని కోట రాజశేఖర్ (కాళీయమర్ధనము), 20న డా. ఐనవోలు శ్రీనివాస చక్రపాణి (కంస, జరాసంధ వధ), 21న దర్శి బాలసుబ్రహ్మణ్యం (సత్రాజిత్తు, నరకాసుర వధ), 22న విద్వాన్ డా.చీమకుర్తి వేంకటేశ్వర రావు (కల్యాణ కృష్ణుడు), 23న శతావధాని డా.సూరం శ్రీనివాసులు (గోపికా వస్త్రాపహరణం, రాసక్రీడ), 24న శ్రీ పోలవరపు లక్ష్మీనరసింహారావు (కుచేలుడు, అక్రూరుడు) ఉపన్యాసకులుగా పాల్గొని భాగవతంలోని వివిధ ఘట్టాలను విశదీకరించారు. అనంతరం ఉపన్యాసకులను ఆలయ నిర్వాహకులు, పద్యసారస్వత పరిషత్ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, మురారిశెట్టి తిరుపతి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# గుండ్రా రంగమ్మ



డిఆర్‌డిఓ ఛైర్మెన్, భారత రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి మాతృమూర్తి శ్రీమతి గుండ్రా రంగమ్మ ఈ నెల 26వ తేదీ తెల్లారుజామున స్వర్గస్తురాలైనారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కనుమూశారు. ఆత్మకూరు మండలం మహిమలూరు వారి స్వగ్రామం. సతీష్‌రెడ్డి ఒక్కడే కుమారుడు. సతీష్‌రెడ్డిని చదివించి ఉన్నతస్థానానికి తీసుకెళ్లడంలో ఆమె కృషి అపారం. తల్లి మరణవార్త తెలియగానే సతీష్‌రెడ్డి హుటాహుటిన స్వగ్రామం మహిమలూరుకు చేరుకున్నారు. జిల్లాలోని అన్ని రాజకీయ పక్షాల నాయకులు, ప్రముఖులు రంగమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఇప్పటికే తండ్రిని, ఇప్పుడు తల్లిని కోల్పోయి దుఃఖసాగరంలో వున్న సతీష్‌రెడ్డికి సానుభూతి తెలుపుతూ, రంగమ్మ మృతికి నివాళులర్పిస్తోంది 'లాయర్'.

# వృద్ధులకు కృష్ణచైతన్య విద్యార్థుల చేయూత




వృద్ధాశ్రమానికి బియ్యాన్ని పంపిణీ చేస్తున్న కృష్ణచైతన్య విద్యార్థులు

నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు ఈనెల 20న నగరంలోని గీతామయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు, బియ్యం పంపిణీ చేశారు. అదేవిధంగా కొండాయపాళెం గేటు వద్ద ఉన్న అంధుల పాఠశాల విద్యార్థులకు, టపాతోపులోని విశ్వజనని అనాధాశ్రమంలోని చిన్నారులకు మిఠాయిలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సేవా కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డితో పాటు డీన్ బి.సుధారాణి, ప్రిన్సిపాల్స్ ఎన్.కృష్ణకుమార్, ఎన్.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆమె వ్యక్తిత్వం.. మాకు కొండంత బలం

**- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు శ్రద్ధాంజలి**

"పసిప్రాయంలోనే తల్లిని కోల్పోయిన నాకు, ఆ మాతృప్రేమను పంచినవారు మా అమ్మమ్మ శ్రీమతి శేషమ్మ గారు, ఆ తర్వాత మా అత్తమ్మ, అమృతమూర్తి శ్రీమతి అల్లూరు కౌశల్యమ్మ. మా అత్తగారు నాకు అమ్మగా, నా పిల్లలకు అమ్మమ్మగా, నా మనుమలు మనుమరాళ్ళకు జేజమ్మగా అందించిన ప్రేమాభిమానాలు మరచిపోలేనివి. ప్రతి ఒక్కరినీ తల్లిలా లాలించిన ఆమె వ్యక్తిత్వమే మా కుటుంబానికి కొండంత బలాన్నిచ్చింది. శ్రీమతి అల్లూరు కౌసల్యమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా మా కుటుంబసభ్యులందరి తరఫున వారికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను" అని ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు ఢిల్లీలోని తన నివాసంలో తమ అత్తగారికి నివాళులర్పించారు. ఈ సందేశాన్ని ట్విట్టర్ ద్వారా తెలియజేస్తూ తమ అత్తగారి పట్ల ఆయనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

# అమ్మమ్మ రుణం జన్మజన్మలకూ తీర్చుకోలేనిది

- **కౌసల్యమ్మ జ్ఞాపకార్ధం త్వరలో ఒకేషనల్ సెంటర్**
- **స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వాహకురాలు దీపా వెంకట్**

'మా అమ్మమ్మ రుణం జన్మజన్మలకూ తీర్చుకోలేనిది. మేము ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నామంటే అందుకు కారణం మా అమ్మమ్మే'..నని స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె దీపా వెంకట్ అన్నారు. ఈనెల 20న వెంకయ్యనాయుడు అత్తగారైన అల్లూరు కౌసల్యమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమెకు ఆయన కుటుంబ సభ్యులంతా ఘనంగా నివాళులర్పించారు. స్వర్ణభారత్ ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరులోని సర్దార్ వల్లభాయిపటేల్ నగర్‌లోని స్వర్ణభారత్ నాలెడ్జ్ సెంటర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దీపా వెంకట్ జ్యోతి ప్రజ్వలన చేసి అమ్మమ్మ కౌసల్యమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి వెంకయ్యనాయుడు రాజకీయాల్లో బిజీగా ఉండడంతో, ఆయనకు సహకారంగా తమ తల్లి ఉషమ్మతో పాటు అమ్మమ్మ కూడా వెంట ఉండేదని, చిన్న తనంలో తనకు, తన సోదరుడు హర్ష వర్ధన్‌కు ఎలాంటి లోటు లేకుండా



స్వర్గీయ అల్లూరు కౌసల్యమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

అమ్మమ్మ తమను కంటికి రెప్పలా చూసుకునేదని, ఆమె రుణం ఏనాటికీ తీర్చుకోలేనిదని అన్నారు. తమ అమ్మమ్మ జ్ఞాపకార్థం ఆమె పేరిట వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఒకేషనల్ సెంటర్‌ను ఏర్పాటుచేయనున్నామని, ఆ సెంటర్‌కు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు జనవరిలో ప్రారంభోత్సవం చేయనున్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా తమ తండ్రిగారైన ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు ట్విట్టర్ ద్వారా పంపిన సందేశాన్ని ఆమె చదివి వినిపించారు. స్వర్ణభారత్ ట్రస్ట్ ఛైర్మెన్, మాజీమంత్రి కామినేని శ్రీనివాస్, కౌసల్యమ్మ కుమార్తె, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ, ముప్పవరపు ఫౌండేషన్ నిర్వాహకులు హర్షవర్ధన్, బిజెపి జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, ట్రస్టీ రాధ పాల్గొన్నారు.

# కావలికి కేంద్రీయ విద్యాలయం

**- ఎంపి ఆదాల**



విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న విశ్వోదయ యాజమాన్యం, పక్కన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈ నెల 21 నుండి తన లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా పర్యటనలు చేశారు. 21వ తేదీ కావలిలోని విశ్వోదయ టెక్నికల్ అకాడమీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కావలికి త్వరలో కేంద్రీయ విద్యాలయాన్ని తీసుకొస్తామని చెప్పాడు. తాను జవహర్ భారతి కాలేజీలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నాడు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ నుండి హెచ్‌సిఎల్‌కు ఎంపికైన 63మంది విద్యార్థులకు ఆయన నియామకపత్రాలను అందజేశారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, విజయడైరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, అకాడమీ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, ఛైర్మెన్ విద్యాధర్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి వంశీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అదేరోజు కొడవలూరు మండలం ఆలూరుపాడు కుమ్మరకుంటలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించాడు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రసన్న ఎంతో కష్టపడుతున్నాడని ఆదాల కితాబిచ్చాడు.

అలాగే 22వ తేదీన నెల్లూరులో సీమాంధ్ర ఎమ్మార్పీయస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌరసన్మాన సభకు హాజరయ్యాడు. బడుగు బలహీన, దళిత వర్గాల ప్రజల అభ్యున్నతికి తన సహకారం ఎల్లప్పుడూ వుంటుందని ఆయన ఈ సందర్భంగా చెప్పాడు. ఎమ్మార్పీయస్ రాష్ట్ర వర్కింగ్ కమిటి అధ్యక్షులు పందింటి సుబ్బయ్య, ఎస్సీ, ఎస్టీ, బిసి సేవాసమితి అధ్యక్షులు కాకి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదాలకు ఘనంగా పౌరసన్మానం జరిగింది.

అదేరోజు ఆయన నెల్లూరు కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో జరిగిన డిసిసిబి ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి అభినందన సభలో పాల్గొన్నాడు. అలాగే సిఎంఆర్ చందన షోరూమ్ లక్కీ డ్రా కార్యక్రమంలో కూడా పాల్గొన్నాడు.

25వ తేదీ నెల్లూరులో జరిగిన క్రిస్టమస్ వేడుకలలోనూ, ఓ ప్రైవేట్ వాహన షోరూమ్ ప్రారంభోత్సవంలోనూ ఆయన పాల్గొనడం జరిగింది. ఆరోజు సాయంత్రం రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసానికి వెళ్లి శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామిని కలిసి ఆయన ఆశీస్సులు అందుకున్నాడు.




ఈ నెల 25వ తేదీన భారత మాజీప్రధాని స్వర్గీయ అటల్‌బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని నెల్లూరులోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా బీజేపీ నాయకులు



## 'ప్రభా'తం

# పాక్.. అతి ప్రేలాపన



సిఏఏ, ఎన్ఆర్సి బిల్లుల విషయంలో కాంగ్రెస్ వాయిస్నే అక్కడ పాక్ ప్రధాని ఇమ్రాన్ఖాన్ కూడా వినిపిస్తున్నాడు. ఈ బిల్లులు మైనార్టీలను ఉద్దేశించి పెట్టినవేనంటూ శోకండాలు పెడుతున్నాడు. అసలు భారత ప్రభుత్వం చేసే చట్టాలపై ఆరోపణలు చేసే అధికారం పాకిస్థాన్ ప్రధానికెవరిచ్చారు? దేశ భద్రతకు సంబంధించిన అంశాలలో ఇక్కడ ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వుండకపోవడం శత్రుదేశానికి అలుసుగా మారుతోంది. ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలనే పాకిస్థాన్ కూడా పునరుద్ఘాటిస్తోంది.

ఏ ఇతర దేశాల అంతర్గత విషయాలలో భారత్ ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు. ఏ దేశ విధానాలనూ ఎప్పుడూ ప్రశ్నించలేదు. ఎందుకంటే ప్రతి దేశ సార్వభౌమత్వాన్ని గౌరవించడం భారత విధి. చిరకాల శత్రుదేశమైన పాకిస్థాన్ అంతర్గత విషయాలలోనూ భారత్ ఎన్నడూ జోక్యం చేసుకోలేదు. భారత్ జోక్యం చేసుకోవాలంటే పాకిస్థాన్లో చాలా అవకాశాలుంటాయి. మైనార్టీల హక్కులను, వారి భద్రతను కాలరాయడంలో పాకిస్థాన్ మొదటి స్థానంలో వుంది. మైనార్టీల మానప్రాణాలకు రక్షణలేని దేశాలలో పాకిస్థాన్ ఒకటి. అలాంటి దేశం ఈరోజు భారత్ అంతర్గత విషయాలలో జోక్యం చేసుకుంటోంది. గురివింద గింజ తన నలుపెరుగదన్న సామెతను గుర్తు చేస్తూ, భారతదేశంలో మైనార్టీల భద్రత, సంక్షేమం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తోంది.

గత కొన్ని రోజులుగా భారతదేశంలో సిఏఏ, ఎన్ఆర్సి బిల్లులపై ఆందోళనలు జరుగుతున్నాయి. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్లలో రక్షణ కొరవడి, అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతున్న మైనార్టీలకు భారత పౌరసత్వం కల్పించడం ఒక బిల్లు ఉద్దేశ్యమైతే, ఈ దేశంలోకి బంగ్లాదేశ్, మయన్మార్ల నుండి జొరబడ్డ వారిని తిరిగి ఆ దేశాలకు పంపించడం ఇంకో బిల్లు లక్ష్యం. ఇందులో దేశంలోని మైనార్టీలను నష్టపరిచే ఉద్దేశ్యమేదీ లేదు. భారతీయ ముస్లింలెవరికీ ఈ బిల్లులతో సంబంధం లేదు. అసలైన భారతీయ ముస్లింలు భయపడాల్సిన పని కూడా లేదు. కేవలం చొరబాటుదారులు భయపడతారంతే!

కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా దానిని వ్యతిరేకించడం కాంగ్రెస్పార్టీ విధాన నిర్ణయంగా మారింది. సిఏఏ, ఎన్ఆర్సి బిల్లులపై కాంగ్రెస్ రాజకీయ విద్వేషాన్ని రగిల్చింది. వీటివల్ల మైనార్టీలకు ఏదో నష్టం జరగబోతున్నట్లు ప్రచారం చేసింది. దీనివల్ల ఆందోళనలు పెరిగాయి. అవి హింసాత్మక రూపం దాల్చాయి. కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమయ్యాయి. కొంతమంది ప్రాణాలు కూడా పోయాయి. పార్లమెంటులో ఆమోదం పొందిన బిల్లును గౌరవించాలనే కనీస జ్ఞానం కూడా కాంగ్రెస్కు లేకుండాపోయింది. కాంగ్రెస్పార్టీ జాతకమేంటోగాని పాకిస్థాన్ నోటి నుండి ఏ వాయిస్ వస్తుందో కాంగ్రెస్ నోటి నుండి కూడా అదే వాయిస్ వస్తుంటుంది. పాకిస్థాన్ ప్రధానమంత్రి భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదైతే మాట్లాడుతాడో, కాంగ్రెస్ అధ్యక్షుడు కూడా భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా అదే మాట్లాడుతాడు.

సిఏఏ, ఎన్ఆర్సి బిల్లుల విషయంలో కాంగ్రెస్ వాయిస్నే అక్కడ పాక్ ప్రధాని ఇమ్రాన్ఖాన్ కూడా వినిపిస్తున్నాడు. ఈ బిల్లులు మైనార్టీలను ఉద్దేశించి పెట్టినవేనంటూ శోకండాలు పెడుతున్నాడు. అసలు భారత ప్రభుత్వం చేసే చట్టాలపై ఆరోపణలు చేసే అధికారం పాకిస్థాన్ ప్రధానికెవరిచ్చారు? దేశ భద్రతకు సంబంధించిన అంశాలలో ఇక్కడ ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వుండకపోవడం శత్రుదేశానికి అలుసుగా మారుతోంది. ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలనే పాకిస్థాన్ కూడా పునరుద్ఘాటిస్తోంది. భారత్లో ఫలానా తప్పు జరిగిపోతోంది, వాళ్ళ దేశానికి సంబంధించిన రాజకీయ పక్షాలే దీనిని నిరసిస్తున్నాయంటూ అంతర్జాతీయ సమాజానికి ఉదాహరణగా చూపిస్తున్నాడు. జమ్మూ-కాశ్మీర్లో ఆర్టికల్ 370ని తొలగించినప్పుడు కూడా పాకిస్థాన్ ప్రధాని ఇదే రకమైన వ్యాఖ్యలు చేశాడు. ఆ ఆర్టికల్ని తొలగించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ చేసిన రాద్ధాంతాన్ని పాకిస్థాన్ ప్రధాని తన ప్రచారానికి వాడుకున్నాడు. అంతర్జాతీయ సమాజంలో భారత్ను దోషిగా చేయాలనిచెప్పి కాంగ్రెస్ వ్యాఖ్యలను సాక్ష్యంగా పెట్టుకున్నాడు.

అసలు భారతదేశంలో మైనార్టీల భద్రత, హక్కుల గురించి ప్రశ్నించే అర్హత పాకిస్థాన్ ప్రధానికి ఎక్కడుంది? మతపరంగా ఏర్పడ్డ రాజ్యం అన్ని మతాలు, అన్ని రకాల సంస్కృతులతో లౌకికవాద దేశంగా విరాజిల్లుతున్న భారత్ వైపు వేలెత్తి చూపడమేమిటి? ఈరోజు ప్రపంచంలోనే ఏ దేశంలో మైనార్టీలు భద్రంగా వున్నారు?

భారతదేశంలో 50ఏళ్ల క్రితం మైనార్టీల శాతమెంత? ఇప్పుడెంత? మైనార్టీలు వివక్షకు గురైంది ఎక్కడ? ఈ దేశంలో 70శాతం మంది హిందువులకు ఎన్ని దేవాలయాలున్నాయో, 20శాతం వున్న ముస్లింలకు దాదాపు అన్నే శాతం మసీదులు, 10శాతం వున్న క్రైస్తవులకు అదే స్థాయిలో చర్చిలు వున్నాయి. భారతదేశంలో వున్నన్ని మసీదులను ఏ ముస్లిం దేశంలో అయినా చూపమనండి. ఈ దేశంలో ఉన్నన్ని చర్చిలను ఏ క్రైస్తవ ఆధిపత్య దేశంలో అయినా చూపమనండి. ఈ దేశంలో మైనార్టీలకు ఉన్నంత స్వేచ్ఛ, భద్రత ఇంకే దేశంలోనన్నా వుందా? ఈ దేశంలో మెజార్టీ హిందువులకు సమస్య వచ్చిందంటే ఒకటిరెండు పార్టీలు మాత్రమే ముందుకొస్తాయి. అదే మైనార్టీలకు సమస్య వచ్చిందంటే అన్ని రాజకీయ పక్షాలు రోడ్లమీదకు చేరుతాయి.

భారత రాజ్యాంగం కుల, మత బేధం లేకుండా ఈ దేశంలోని పౌరులందరికీ ఓటు హక్కు కల్పించింది. మైనార్టీల హక్కులకు, సంక్షేమానికి ఆ ఓటే వజ్రాయుధంగా మారింది. స్వాతంత్ర్యానంతరం ఈ దేశం పాకిస్థాన్లాగే మత రాజ్యంగా ఏర్పడి, మైనార్టీలకు ఓటు హక్కు కల్పించకపోయి వుంటే ఈ దేశంలో ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా మైనార్టీల గురించి ఆలోచన చేసేదే కాదు. ఓటు అనే ఆయుధం వారి చేతుల్లో వున్నంతకాలం వారి భద్రతకు, ఈ దేశంలో వారి ఉనికికి వచ్చిన ఇబ్బందేమీ లేదు.

ఇక్కడ మైనార్టీల గురించి పాక్ ప్రధాని ఇమ్రాన్ఖాన్ అంత ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మైనార్టీలను పాకిస్థాన్లో అణగదొక్కినంతగా, వారిని అక్కడ చిత్రహింసలు పెట్టినంతగా.. ఈ దేశంలో వుండదు. ఇక్కడ మెజార్టీలు, మైనార్టీలు అంతా సోదరభావంతోనే వున్నారు. ఈ దేశ ప్రజలు వారి సమస్యలను వారే పరిష్కరించుకుంటారు. పాక్ ప్రధాని తన దేశం సంగతి చూసుకుంటే మంచిది!

# నేత్రపర్వం.. పుష్పాభిషేకం



పుష్పాభిషేకంలో ఉభయకర్తగా పాల్గొన్న గ్రోసు గోపాలయ్య

నెల్లూరు వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి ఆలయంలో కనువిందుగా జరుగుతున్న మండల పూజోత్సవాల్లో భాగంగా ఈనెల 20వ తేదీన స్వామివారికి పుష్పాభిషేకం నిర్వహించారు. ప్రధాన తంత్రి నంబూద్రిపాద్ సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత స్వామివారికి నవకాభిషేకం జరిగింది. స్వామివారిని శోభాయమానంగా అలంకరించి ఈ పూజలు నిర్వహించారు. ఐతా వెంకట బాలకృష్ణారావు, పద్మావతి, గ్రోసు గోపాలయ్య, శాంతమ్మ, రంగయ్యనాయుడు, సుదర్శనమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష కార్యదర్శులు రంగరాజన్, శేషగిరిరావు, కోశాధికారి విజయకుమార్, సభ్యులు నాగేశ్వరరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచలకోనలో వేడుకగా..

# గోదాదేవి అమ్మవారి క్షేత్రోత్సవం

ధనుర్మాసం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఈనెల 20న గోదాదేవికి క్షేత్రోత్సవం నిర్వహించారు. ధనుర్మాసంలో నాలుగు శుక్రవారాలు గోదాదేవికి ప్రత్యేకపూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో తొలి శుక్రవారం రోజున గోదాదేవి అమ్మవారికి ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా క్షేత్రోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీనృసింహస్వామికి తిరుప్పావై, విశిష్టపూజలు చేశారు. స్వామివారి ఆలంకారమండపంలో గోదాదేవి ఉత్సవ విగ్రహాని కొలువుదీర్చి తిరుమాడ వీధుల్లో వేడుకగా క్షేత్రోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు సీతారామయ్యస్వామి, శశిస్వామి, త్రినాధ్స్వామి, నాగరాజస్వామిల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు మధుస్వామి, సువర్ణలక్ష్మి ఉభయకర్తలుగా వ్యవహరించారు.




# ముస్లింలకు నష్టమేంటి?

సిఏఏ, ఎన్ఆర్సి బిల్లులకు వ్యతిరేకంగా ముస్లింలు ఆందోళనలు చేయడం అర్ధరహితం. ఈ రెండు బిల్లులతో భారతీయ ముస్లింలకు వచ్చిన ఇబ్బందేమీ లేదు. వాళ్ళు ఈ దేశ పౌరులే! మయన్మార్, బంగ్లాదేశ్ల నుండి అక్రమంగా చొరబడిన వారిని తిరిగి వారి దేశాలకు పంపించడంలో అభ్యంతర పెట్టాల్సిందేమీ లేదు. ఏ దేశం కూడా అక్రమ చొరబాటుదారులను తమ దేశాలలో వుంచుకోవడం లేదుకదా! మరి భారతదేశంలో మాత్రం ఎందుకుంచుకోవాలి. ముస్లింలు ఇక్కడ చేస్తున్న ఆందోళనలు, హింసను బంగ్లాదేశ్, పాకిస్థాన్లలో మైనార్టీలుగా వున్న హిందువులు చేస్తే ఆ దేశాలు వూరుకుంటాయా? నిర్ధాక్షిణ్యంగా చంపేస్తాయి. కాబట్టి ఈ దేశంలో లభించినంత స్వేచ్ఛ మైనార్టీలకు ఇంకే దేశంలోనూ లభించదు. ఆ స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోవద్దు.

– చక్రాల పాండురంగయ్య, నెల్లూరు.

## చంద్రబాబే నాశనం చేశాడు

అమరావతి రైతులను నిలువునా ముంచింది మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే! కేవలం రియల్ఎస్టేట్ వ్యాపారం చేసుకోవడానికే ఆయన రైతుల నుండి 33వేల ఎకరాల భూములు లాక్కున్నాడు. అమరావతి రాజధానిని నిర్మించాలనే చిత్తశుద్ధే ఆయనలో వుండుంటే ఒక ఐదారువేల ఎకరాలలో గత ఐదేళ్లలోనే రాజధాని నిర్మాణం పూర్తి చేసుండేవాడు. ఇప్పుడు జగన్మోహన్రెడ్డి వచ్చినా మార్చడానికి వీలుండేది కాదు. కాని, చంద్రబాబు 33వేల ఎకరాలు తీసుకుని అన్నీ అరకొర పనులు చేసి రాజధానిని మార్చుకోవడానికి అవకాశముండేటట్లు చేశాడు. దాని ఫలితమే ఇప్పుడు అమరావతి రైతులు అనుభవిస్తున్నారు.

పి. సురేష్, దుగ్గిరాల.

## పరిపాలన ఒకేచోట వుండాలి

రాష్ట్ర ప్రజలు అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని కోరుకుంటున్నారు. అంతేగాని, పరిపాలన వికేంద్రీకరణ జరగాలని కోరుకోవడం లేదు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్రెడ్డి ఆలోచన అభినందనీయమే! అదే సమయంలో చట్టసభలు ఒక చోట, సచివాలయం ఒక చోట వుండాలనడం కరెక్ట్ కాదు. దీనివల్ల పెద్ద ఉపయోగం కూడా వుండదు. అనవసర వ్యయప్రయాస కూడా! పరిపాలన అంతా ఒకచోట పెట్టి మిగతా వ్యవస్థలను వికేంద్రీకరించడం ఉత్తమం. పరిపాలనాకేంద్రాలను తప్పితే మిగతా అభివృద్ధి ప్రాజెక్టులను అన్ని జిల్లాలకు సమంగా పంచాలి.

సూరా మస్తాన్రెడ్డి, నెల్లూరు.

## తనిఖీ అప్పడే ఎల్ఎల్ఆర్ టెస్ట్లు

నెల్లూరు నగరంలో పోలీసుల వాహనాల తనిఖీలు ఎక్కువుగా వుంటున్నాయి. ఫైన్లు కూడా బాగానే వేస్తున్నారు. అయితే పోలీసులు కొంచెం దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. బైక్లను ఆపి ముందుగా తాళాలను చేతిలోకి తీసుకుంటున్నారు. తనిఖీ చేసినప్పుడు లైసెన్స్ లేనివారికి అప్పటికప్పుడు ఎల్ఎల్ఆర్ టెస్ట్లు పెడితే బాగుంటుంది. దీనివల్ల రవాణాశాఖకు కూడా ఆదాయం పెరుగుతుంది. వాహనదారులకు ఆర్టీఓ ఆఫీసు చుట్టూ తిరిగే శ్రమ తప్పుతుంది. ఈ విధంగా చేస్తే వాహనదారులకు లైసెన్స్లు సులభంగా వచ్చినట్లవుతుంది. కొత్తగా వచ్చిన జిల్లా ఎస్పీ భాస్కర్భూషణ్ గారు ఈ విషయంపై ఆలోచిస్తే బాగుంటుంది.

జె. యస్. కృష్ణ, నెల్లూరు.

● విస్తృతంగా తనిఖీలు

# హడలెత్తిస్తున్న పోలీస్



*జనాభాను ఎంతైనా పెంచొచ్చు... ఎన్ని కార్లు, బస్సులనైనా తయారు చేయవచ్చు... ధాన్యం దిగుబడులను పెంచొచ్చు... కాని భూమి అన్న దానిని ఒక్క మిల్లీమీటరు కూడా పెంచలేము. జనాభా పెరిగారు, వాహనాలు పెరిగాయని చెప్పి, మన అవసరాలకు అనుగుణంగా స్థలం పెరగదు... రోడ్ల వెడల్పు పెరగదు కదా!*

చిన్న ఉదాహరణ చూద్దాం... 15ఏళ్ల క్రితం నెల్లూరు, మాగుంట లే అవుట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో 25 ఫ్లాట్లు వుండేవి. అన్ని ఫ్లాట్లకు కలిపి 15 కార్లు, 25దాకా బైక్‌లు వుండేవి. ఈరోజు అదే అపార్ట్‌మెంటులో 30 కార్లు, 50 దాకా బైక్‌లు వుంటున్నాయి. అన్నింటినీ అపార్ట్‌మెంట్‌లో పెట్టే పరిస్థితి లేక సగం వాహనాలను రోడ్డుమీదే పెట్టేస్తున్నారు.

నెల్లూరు నగరంలో వాహనాలు ఎంతగా పెరిగాయనేందుకు ఇదో ఉదాహరణ. 15ఏళ్ల క్రితం వున్న వాహనాల సంఖ్యకు, ఇప్పుడున్న వాహనాల సంఖ్యకు అసలు పొంతన వుండదు. నగరంలో జనాభా కంటే కూడా వాహనాలు శరవేగంగా పెరుగుతున్నాయి. కనీసం బైక్ అన్నది ప్రతి ఇంటికి ఒక నిత్యావసర వస్తువుగా మారిపోయింది.

కాని వాహనాలు పెరిగినట్లుగా రోడ్లు పెరగవుకదా... రోడ్లను వెడల్పు చేసుకుంటూ పోలేం కదా! కాబట్టే నగరం నిండా ట్రాఫిక్ సమస్యలు. పోలీసులు కూడా నగరంలో ట్రాఫిక్‌ను ఏ విధంగా దారిలో పెట్టాలా అన్నదాని కంటే కూడా వాహనాలను తనిఖీ చేసి జరిమానాలు వ్రాయడంపైనే ప్రధాన దృష్టి పెడుతున్నారు. దాంతో ట్రాఫిక్ సమస్య దారికి రాకపోగా మరింత జఠిలమవుతోంది.

ఈమధ్య నగరంలో ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు ముమ్మరమయ్యాయి. ఏ సెంటర్‌లో చూసినా పోలీసులే. బండ్లు ఆపేస్తున్నారు. వాహనాల పత్రాలను తనిఖీ చేసి, ఏ పత్రం తగ్గినా జరిమానాలు రాస్తున్నారు. అంతవరకు బాగానేవుంది. ముఖ్యంగా లైసెన్స్‌లను తనిఖీ చేయాల్సిందే. మైనర్లు బండ్లు తోలుతుండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే నగరంలో చైన్ స్నాచింగ్ వంటి నేరాలు కూడా బైక్‌ల మీదే చేస్తున్నారు. వీటిని కంట్రోల్ చేయాలంటే తనిఖీలు వుండాల్సిందే!

## పార్కింగ్ లేక ప్రజల అవస్థలు...

అదే సమయంలో ట్రాఫిక్‌పై కూడా దృష్టి పెట్టాలి. నగరంలోని ట్రంకురోడ్డు, మినీబైపాస్, పొదలకూరురోడ్డు ప్రధాన ట్రాఫిక్ రద్దీ వుండే రహదారులు, వ్యాపార, వాణిజ్య సంస్థలన్నీ ఈ రోడ్ల పక్కనే వుంటాయి. ఏ భవనానికి కూడా సరైన పార్కింగ్ వసతి లేదు. ఈ షాపుల వద్దకు వచ్చినవాళ్ళు తమ వాహనాలను వాటి కెదురుగా నిలపాల్సిందే! అయితే ట్రాఫిక్ పోలీసులొచ్చి నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు పెట్టారంటూ చలానాలు వ్రాస్తున్నారు. పోలీసు వ్రాసే చలానాలు చూసి వాహనదారులకు కళ్లు తిరుగుతున్నాయి. జరిమానాలు అంతగా వుంటున్నాయి.

నగరంలో రోడ్లే పార్కింగ్ ప్రాంతాలు అన్నట్లుగా పరిస్థితి వుంది. కాని అధికారులు దృష్టి పెడితే నగరంలో కొన్ని పార్కింగ్ స్థలాలను గుర్తించడానికి అవకాశముంది. ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైఓవర్ క్రింద, బోసుబొమ్మ వద్ద ఏబిఎం కాంపౌండ్, నర్తకి సెంటర్, ఏ.సి మార్కెట్ వద్ద వైఎంసి గ్రౌండ్ వంటి స్థలాలను పెయిడ్ పార్కింగ్‌లుగా ఏర్పాటు చేస్తే నగరంలో వాహనదారులకు జరిమానాల బాధలు తగ్గుతాయి.

# జిల్లా వైసిపిలో... ఎవరికి వారే..

*గతంలో ఒక జిల్లాలో మంత్రి అంటే ఎలా వుండేవాడు... జిల్లా మొత్తానికి రాజులా వుండేవాడు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో పర్యటించేవాడు. అన్ని నియోజకవర్గాలలో సమస్యలను పట్టించుకునేవాడు. ఆయా నియోజక వర్గాల శాసనసభ్యులతో కలిసి అధికారిక కార్యకలాపాలలో పాల్గొనేవాడు. మంత్రుల వద్దకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వచ్చి తమ సమస్యలు చెప్పుకునే వాళ్ళు. మంత్రులు కూడా అదే రీతిలో స్పందించేవాళ్ళు.*

అప్పట్లో ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య సన్నిహిత సంబంధాలుండేవి. లోక్‌సభ సభ్యులు తమ లోక్‌సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో పర్యటిస్తుండేవాళ్ళు. అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వాములవుతుండేవాళ్ళు.

కాని, ఇప్పుడు రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. మంత్రులు వారివారి నియోజకవర్గాలకు పరిమితమవుతున్న పరిస్థితి. ఎందుకంటే మిగతా ఎమ్మెల్యేలు వారిని తమ నియోజకవర్గాలకు ఆహ్వానించడంగాని, అక్కడ జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రులతో చర్చించడం, పలు కార్యక్రమాలకు మంత్రులను అతిథులుగా పిలవడంగాని జరగడం లేదు.

జిల్లాలో ఇద్దరు మంత్రులున్నారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి వుంటే ఆత్మకూరు నియోజకవర్గానికే పరిమితమయ్యాడు. మిగతా నియోజకవర్గాలకు ఆయన వెళ్లడం లేదు. అలాగే మిగతా ఎమ్మెల్యేలు కూడా ఆయనను పిలుస్తున్నట్లుగా లేదు. మరో మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ నెల్లూరు సిటీ, రూరల్‌లలో ఎక్కువ పర్యటనలు చేస్తున్నాడు. కోవూరు, కావలి ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకు అనిల్‌ను ఆహ్వానిస్తున్నారు. మిగతా ఎమ్మెల్యేలు మంత్రిగా అనిల్‌ను ఏ కార్యక్రమాలకు కూడా ఆహ్వానించడం లేదు. ఆయన ఎంతో కీలకమైన ఇరిగేషన్‌శాఖ మంత్రి. ప్రతి నియోజకవర్గంలోనూ ఆ శాఖకు సంబంధించి పనులు, సమస్యలు ఉన్నాయి. మంత్రి ద్వారా వాటిని పరిష్కరించుకోవచ్చు. అయినా కూడా కొందరు ఎమ్మెల్యేలు ఆయనతో దూరంగానే వుంటున్నారు. తమకు ఆయన మంత్రి కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇలా అయితే పార్టీలోని నాయకులే కలసికట్టుగా లేరనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లే ప్రమాదముంది.

# ముందుకు కదులుతున్న రామాయపట్నం



*అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్న తరుణంలో నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు ప్రయోజనకారిగా వుండే రామాయపట్నం పోర్టుపై కూడా ముందడుగు పడబోతోంది.*

జిల్లాల వారీగా అభివృద్ధిని వికేంద్రీకరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఈ క్రమంలో చూస్తే నెల్లూరు జిల్లాలో కృష్ణపట్నం పోర్టు వుంది. ఈ జిల్లాలోనే దుగరాజపట్నం వద్ద మరో పోర్టును ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావించినప్పటికి ఇస్రో, పర్యావరణ సంస్థల అభ్యంతరాల నేపథ్యంలో ఆ ప్రతిపాదన వెనక్కిపోయింది. దాని బదులు నెల్లూరు - ప్రకాశం జిల్లాల సరిహద్దులో వుండే రామాయపట్నం వద్ద పోర్టును ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటినుండో వుంది.

గత తెలుగుదేశం ప్రభుత్వం చివరిరోజుల్లో ఇక్కడ పోర్టు నిర్మాణం అంటూ హడావిడిగా

(మిగతా 10వ పేజీలో)

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



నూతన సంవత్సర మరియు ఓం సంక్రాంతి శుభాకాంక్షలు

మా "మురళీకృష్ణ" నేతి మిఠాయిలతో మా ఆత్మబంధువులు, కస్టమర్ దేవుళ్ళు అందరూ
ఈ నూతన సంవత్సరాన్ని ఆనందంగా, తియ్యతియ్యగా ప్రారంభించాలని కోరుకుంటూ...

స్వీట్స్ గిఫ్ట్‌ప్యాకింగ్ బాక్స్‌లలో లభించును



డిసెంబర్ 31 మరియు జనవరి 1వ తేదీ మాత్రమే

మురళీకృష్ణ నేతిమిఠాయిలు

మద్రాసు బస్టాండ్ దగ్గర, నెల్లూరు. ఫోన్: 2327522, 2336616, 2326888.

మరియు ఆర్టీసీ ఎదురుగా వున్న మురళీకృష్ణ ఫ్రెష్‌స్వీట్స్ మరియు మాగుంట లే అవుట్‌లోని
"నిర్వాణ రెస్టారెంట్" నందు కూడా లభించును. ఫోన్: 2321777

నెల్లూరు కబుర్లు

2020

# స్వాగత సన్నాహాలు

ఇరవై ఏళ్ల క్రితం అప్పుడు సీఎంగా వున్న చంద్ర బాబునాయుడు విజన్ 2020 అని కలవరిస్తుంటే ఇంకో 20ఏళ్ల తర్వాత జరిగేదానికి ఆయన ఇప్పుడే కలలు కంటుండాడని అనుకునేవాళ్లు. చంద్రబాబు చెప్పిన ఆ 2020 మరో 3రోజుల్లో రాబోతోంది. 2020 సంవత్సరానికి నగరంలో స్వాగత సన్నాహాలు జరుగుతున్నాయి. 2019కి వీడ్కోలు పలుకుతూ 2020కి స్వాగతం చెప్పే విధంగా పలు కార్యక్రమాలు రూపొందించుకుంటున్నారు.

నూతన సంవత్సర వేడుకల కోసం హోటల్స్, బేకరీలు, స్వీట్ షాపులు ప్రత్యేక ఆఫర్లతో ఆహ్వా నిస్తున్నాయి. కాకపోతే ఈ సంవత్సరం ప్రభుత్వం మద్యం అమ్మకాలపై విధించిన ఆంక్షల వల్ల మందు బాబులే తెగ ఇబ్బందిపడే అవకాశముంది.

### అర్ధ శతాబ్దం తర్వాత

# ఆత్మీయ సమావేశం



సమావేశంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

దాదాపు 50ఏళ్ల తర్వాత ఒకే కాలేజీలో ఒకే గ్రూపులో చదివిన విద్యార్థులంతా ఒకేచోట చేరిన అద్భుత ఘట్టం ఈ నెల 22వ తేదీన నెల్లూరులో ఆవిష్కృతమైంది. నెల్లూరు విఆర్ కళాశాలలో 1966–69 బ్యాచ్ బి.ఏ పూర్వవిద్యార్థులు 22వ తేదీ విఆర్ కళాశాల ఆడిటోరియం నందు సమావేశమయ్యారు. 50ఏళ్ల క్రితం జ్ఞాపకాలను, వారి అధ్యాపకులను గుర్తు చేసుకున్నారు. మాల కొండయ్య, ఆర్‌విఆర్ శర్మ, రామకృష్ణబాబు, రమేష్, చంద్రప్రసాద్, వాసుదేవన్, ఇతర పూర్వవిద్యార్థులు ఈ సమా వేశానికి హాజరయ్యారు.

# ఆయన స్టైలే వేరు!

## టౌన్‌హాల్‌లో వివేకా 69వ జయంతి



నెల్లూరు మాజీ శాసనసభ్యులు, స్టైల్ ఆఫ్ సింహ పురి స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి 69వ జయంతి కార్యక్రమం 23వ తేదీ నెల్లూరు పురమందిరంలో జరిగింది. వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామ నారాయణరెడ్డి, సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, డిసిసిబి మాజీఛైర్మెన్ వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యేలు ముంగ మూరు శ్రీధరకృష్ణారెడ్డి, సివి శేషారెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణా రెడ్డి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఆల్తూరు ఆదినారా యణరెడ్డి, సీనియర్ న్యాయవాది నాగారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సయ్యద్ సమి, చాట్ల నరసింహారావు, కోడూరు రవీంద్రరెడ్డి, ఎం.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొని వివేకాతో తమకున్న అనుబంధాన్ని జ్ఞాపకం చేసు కున్నారు. నెల్లూరులో ఆయన లేని లోటు పూడ్చలేని దని, రాజకీయాలలో, ప్రజాజీవనంలో ఆయన స్టైలే ఎంతో వినూత్నంగా వుండేదని చెప్పారు. వివేకాను ఒక రాజకీయ శిక్షణ కేంద్రంగా నాయకులంతా అభివర్ణించారు.

### ప్రభుత్వాసుపత్రిని

# తనిఖీ చేసిన జేడీ

వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త సంచాలకులు (జేడీ) రాజేంద్రప్రసాద్ ఈనెల 23న నెల్లూరులోని ప్రభు త్వాసుపత్రిని తనిఖీ చేశారు. బాలింతలు, గర్భిణులకు అందుతున్న వైద్యసేవలను గురించి తెలుసుకున్నారు. ఎస్ఎన్‌సియూ, ఎన్ఆర్‌సీ, కాన్పుల గదిని పరిశీలిం చారు. అనంతరం వెంగళరావు నగర్‌లోని ముఖ్య మంత్రి ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అందుతున్న వైద్యసేవలు తెలుసుకున్నారు. టీబీ కంట్రోలు వైద్యాధికారి అమరేంద్రనాథ్‌రెడ్డి, ఆర్‌బీయస్‌కే సమన్వయకర్త వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఫ్లైఓవర్లకు అధిక ప్రాధాన్యత

**- ఆదాల ప్రభాకర్‌రెడ్డి**



ఆదాలకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్లైఓవర్ పోరాట కమిటీ సభ్యులు

నెల్లూరు నగరంలో 5 ఫ్లైఓవర్ వంతెనల అవసరముందని, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఈ ఫ్లైఓవర్ వంతెనలు సాధించడానికి కృషి చేస్తున్నానని, దీని కోసం కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కూడా కలిసి చర్చించామని నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీన సిపిఎం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం, ఫ్లైఓవర్ పోరాట కమిటి ప్రతి నిధులు నెల్లూరులో ఎంపీ ఆదాలను కలిసి నగ రంలో ఫ్లైఓవర్ వంతెనల అవసరాన్ని వివరిం చారు. 2004 నుండి ఇప్పటివరకు ఫ్లైఓవర్ వంతెనలు లేని కారణంగా 200 మంది ప్రాణాలు కోల్పోయా రని, 400 మంది దాకా వికలాంగులయ్యారని వారు తెలిపారు. దీనికి స్పందించిన ఆదాల ఫ్లైఓవర్ వంతెనల కోసం తాము చేస్తున్న కృషిని వెల్లడించారు. ఫిబ్రవరిలో జరిగే పార్లమెంటు సమావేశాలలో జాతీయ రహదారుల ఛైర్మెన్‌ను కలిసి మాట్లాడి వీటిని సాధిస్తామని హామీ ఇచ్చారు.

ఆచార్య ఆదిత్య, కె.శ్రీనివాసులు, ఎస్.కోటిరెడ్డి, సతీష్, సూర్యనారాయణ, శంకర్, రామకృష్ణ ఆదాలను కలిసిన వారిలో వున్నారు.

# వసూల్‌రాజాపై వేటు

జాతీయ రహదారిపై తనిఖీల పేరుతో లారీలను ఆపి డ్రైవర్ల నుండి అక్రమంగా నగదు వసూలు చేస్తున్న వెంకటచాలం ఏఎస్ఐ బి.రవీంద్రను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ ఉత్తర్వులు జారీ చేశాడు. వెంకటాచలం టోల్‌ప్లాజా సమీపంలో రాత్రిళ్లు లారీలను ఆపి అక్రమంగా నగదు వసూలు చేస్తున్నట్లు ఎస్పీకి ఫిర్యాదులు రావడంతో ఆయన వెంటనే చర్యలు తీసుకున్నారు.

# రాజధానిగా నెల్లూరు బెస్ట్

## కలెక్టర్‌కు చెప్పిన ఆనం వెంకటరమణారెడ్డి

ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా నెల్లూరు అయితే ఇంకా ఎంతో బాగుంటుందని కోరుతూ తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణా రెడ్డి జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబుకు సూచిం చాడు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆయన జిల్లా కలెక్టర్‌ను కలిసి దీనిపై వినతిపత్రం సమర్పిం చాడు. సువిశాలమైన సముద్రతీరం, జాతీయ రహ దారి, కృష్ణపట్నంపోర్టు, సెజ్‌లు, రైల్వేలైన్, త్వరలో రానున్న ఎయిర్‌పోర్టు, పక్కనే తమిళనాడు... ఇన్ని వసతులున్న నెల్లూరుజిల్లాను రాజధానిగా చేయాలని ఆయన డిమాండ్ చేశాడు.

### ఫ్రెండ్స్ వాకర్స్‌కు

# అవార్డుల పంట



వాకర్స్ ఇంటర్నేషనల్ 28వ యాన్యువల్ కన్వెన్షన్–2019 కార్యక్రమం ఈనెల 21,22 తేదీలలో ఒరిస్సా రాష్ట్రంలోని బెర్హంపూర్ బిజూ పట్నాయక్ సంస్కృతిక భవన్‌లో జరిగింది. 2019 జనవరి నుండి ఫ్రెండ్స్ వాకర్స్ చేసిన పలు సేవా కార్యక్రమాలను గుర్తించి వాకర్స్ ఇంటర్నేషనల్ 2019 ప్రెసిడెంట్ పిఆర్ ఎన్ చంద్రమౌళి చేతుల మీదుగా ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బల రామయ్య నాయుడుకు బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు, క్యాష్ అవార్డు, బెస్ట్ సర్వీస్ క్లబ్ అవార్డు, కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు స్పెషల్ అప్రీసియేషన్ క్లబ్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా 2018–2019 ఫ్రెండ్స్ వాకర్స్ డైరెక్టరీని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పిఆర్ఎన్ చంద్రమౌళి ఆవిష్కరించారు. చెలికాని సీతారామయ్య, యంవి సుబ్బారెడ్డి, యస్.రాఘవేంద్ర షెట్టి, ఏకొల్లు రాఘవరెడ్డి, శ్యామల శ్రీనివాసరెడ్డి, షేక్ లాల్‌వజీర్, యం.రామక్రిష్ణారెడ్డి, కె. తిరుపతినాయుడు పాల్గొన్నారు.

# బార్ల యజమానులకు ఊరట

పాత బార్ల యజమానులకు తాత్కాలిక వూరట లభించింది. కొత్త బార్ల పాలసీకి హైకోర్టు తాత్కాలి కంగా బ్రేక్ వేసింది. రాష్ట్ర ప్రభుత్వం పాత బార్ల లైసెన్సులన్నింటినీ రద్దు చేస్తూ కొత్త బార్ల లైసెన్సుల ప్రక్రియను ప్రారంభించడం తెలిసిందే! 40శాతం వరకు బార్లను తగ్గించడమే కాక, పట్టణ, నగరాల జనాభాను బట్టి లైసెన్స్ ఫీజులను నిర్ణయించారు. లాటరీ ద్వారా లైసెన్స్‌లు కేటాయించడానికి దర ఖాస్తులను కూడా స్వీకరించారు. అయితే తమ లైసెన్సులను రద్దు చేయడాన్ని నిరసిస్తూ పాత బార్ల యజమానులు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిని విచారించిన హైకోర్టు బార్ల లైసెన్స్‌లకు లాటరీ నిర్వహణపై స్టే ఇచ్చింది. దీనిపై 6 వారాల తర్వాత విచారణ జరుపనుంది.

### పౌరసత్వ బిల్లు పట్ల

# ఆందోళన వద్దు

కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న పౌరసత్వ సవరణ బిల్లుపై ముస్లింలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏబివిపి జిల్లా కో-కన్వీనర్ నలిశెట్టి రాజశేఖర్ పేర్కొన్నారు. ఈనెల 20న నెల్లూరు నగరంలోని విఆర్‌సి వద్ద నుంచి గాంధీబొమ్మ కూడలి వరకు ఏబివిపి ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి పౌరసత్వ సవరణ బిల్లుకు మద్దతు ప్రకటించారు. తాము ఈ బిల్లును స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి నాయకులు జశ్వంత్, జయంత్, బాషా, లక్ష్మణ్, శైలేష్, ప్రశాంత్, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

### డీకెడబ్ల్యూ కళాశాల

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నెల్లూరు డీకెడబ్ల్యూ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈనెల 21న జరిగింది. ముఖ్య అతిథిగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సతీమణి సునంద పాల్గొని నాటి స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు జ్యోతిరెడ్డి, కార్యదర్శి కుసుమకుమారి, సంయుక్త కార్యదర్శి జయలక్ష్మి కళాశాల అభివృద్ధికి ప్రణాళిక, వారు చేసే సహాయ సహకారాలను గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ పద్మజ, విశ్రాంత ప్రిన్సిపల్ రాధిక, సంఘ కన్వీనర్ క్యాథరిన్, పద్మ ప్రియ, అపర్ణ, లక్ష్మి ,మమత తదితరులు పాల్గొన్నారు.




# అన్ని రోడ్లను పూర్తి చేస్తాం

## - మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు నగరం 15వ డివిజన్ లక్ష్మీ నగర్‌లో 11.20 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి ఈ నెల 25వ తేదీన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ శంకుస్థాపన చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో అధ్వాన్నంగా తయారు చేసిన రోడ్లన్నింటినీ బాగు చేస్తామని, ప్రజల ఇబ్బందులు తొలగిస్తామని చెప్పాడు. నగరంలో రహదారుల మరమ్మత్తులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాడు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైసిపి నాయకులు గణేశం వెంకటేశ్వర్లురెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి, రోసిరెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, శరత్‌రెడ్డి, ఎస్‌కె సుభాన్, నాగార్జునరెడ్డి, నాగూర్, ఫయాజ్, కిషోర్, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్

### 300 కోట్లతో నెల్లూరు అభివృద్ధి

నెల్లూరు నగరాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు త్వరలో 300 కోట్ల రూపాయలతో పనులను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.పి.అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు. ఈనెల 21న ఆయన నెల్లూరులో 3వ డివిజన్ సచివాలయాన్ని ప్రారంభించారు. వేణుగోపాలస్వామి దేవస్థానం స్థలంలో ప్రహరీ నిర్మాణానికి, స్టోన్‌హౌస్‌పేటలో కేఎసి కళాశాల ఆధునీకరణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా నగరంలో మొక్కలు నాటుతున్నామన్నారు. దేవాలయాల ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అర్చకులు లేని ఆలయాల్లో అర్చకులను ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. 115 కోట్ల రూపాయల వ్యయంతో నెల్లూరు నగరంలో రోడ్లు, డ్రైన్ల పనులకు వారం రోజుల్లోనే టెండర్లు పిలువనున్నామని, మరికొన్ని అభివృద్ధి పనులకు మరో 100 కోట్ల రూపాయల దాకా కేటాయించనున్నామని చెప్పారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో సుమారు 20 కోట్ల రూపాయల వ్యయంతో పాఠశాలల ఆధునీకరణ చేపట్టనున్నామన్నారు. రెండేళ్ళలో నగర రూపురేఖలు మార్చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి నాయకులు ముక్కాల ద్వారకానాథ్, సంక్రాంతి కల్యాణ్, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఈటె మల్లికార్జున, అక్బర్, జయమ్మ, సుబ్బారావు, సురేంద్ర, వసంత, ధనుంజయ పాల్గొన్నారు.

# దొందూ... దొందే!

## చంద్రబాబు, పవన్‌లపై ప్రసన్న విమర్శ



మూడు రాజధానుల విషయంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన నాయకుడు పవన్ కల్యాణ్‌లు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని, ఇద్దరు పిచ్చోళ్ళతో అన్నీ అనర్ధాలేనని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కోవూరు మండలంలోని దామరమడుగు, రేబాల, జొన్నవాడ గ్రామాల్లో ఈనెల23న ఆయన పలు అభివృద్ధిపనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ రాజధాని మారితే అక్కడి ప్రజల భూములను దోచుకున్న చంద్రబాబు అండ్‌కో నేతలకు నష్టమని ఏవేవో విమర్శలు చేస్తుండడం అర్ధరహితమన్నారు. చంద్రబాబు ఇచ్చే సూట్‌కేసులకు అమ్ముడుబోయిన పవన్‌కల్యాణ్ రాజధాని ప్రజలను రెచ్చగొట్టి గందరగోళం సృష్టిస్తున్నాడని ఆరోపించారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో అన్ని ప్రాంతాల సమస్యలను తెలుసుకున్నారని, అన్ని ప్రాంతాల అభ్యున్నతికే మూడు రాజధానులను ప్రకటించారని ఆయనన్నారు. 'దిశ' చట్టం దేశానికే తలమానికమని, మహిళల రక్షణకు ఎంతో ఉపయోగపడేలా చట్టం రూపొందించారని, దీనిపై అన్ని రాష్ట్రాల నేతలు దృష్టి సారించారని ఆయన పేర్కొన్నారు. అంతేకాక రాష్ట్రంలో పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ వేలాది కోట్ల రూపాయలు కేటాయించడం ఎంతో సంతోషకరమన్నారు. తొలివిడతగా 15,715 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం 3500 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు.

# దారితప్పిన పాలన

## - కర్నాటి



రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పి అడ్డదిడ్డంగా పోతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి ఆరోపించాడు. 23వ తేదీ నెల్లూరులో బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నాయన్నాడు. రాజధాని విషయంలో జిఎన్‌రావు కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారని, అయితే ఆ కమిటీ నివేదిక ఇవ్వకముందే అందులోని విషయాలను ముందుగానే అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఎలా చెబుతారని ప్రశ్నించాడు. దీనినిబట్టి చూస్తే జిఎన్ రావు కమిటీ కేవలం అలంకారప్రాయమేనని, జగన్ నిర్ణయాల మేరకే ఆ కమిటీ నివేదిక ఇచ్చిందన్నది అర్థమవుతుందన్నాడు. బీజేపీ అభివృద్ధి వికేంద్రీకరణను కోరుకుంటుందే గాని, పరిపాలన వికేంద్రీకరణను కాదన్నాడు. రాజధాని మార్పు అసంబద్ధ నిర్ణయమని, ఇలా రాజధానులు మార్చుకుంటూ పోవడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదన్నాడు. రాష్ట్రంపై 3లక్షల కోట్ల అప్పు వున్న తరుణంలో పరిపాలనపై దృష్టి పెట్టకుండా ఇలాంటి గందరగోళానికి గురిచేసే నిర్ణయాలు తీసుకోవడం సబబు కాదని ఆయన పేర్కొన్నాడు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి,, నాయకులు మండ్ల ఈశ్వరయ్య, కరణం భాస్కర్, మారుబోయిన శ్రీనివాసులు, యశ్వంత్ సింగ్, పరశురాం, గిరికుమార్‌గౌడ్, పెద్ద రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'స్థానిక' సమరానికి సిద్ధం కండి!

## కాంగ్రెస్ కార్యకర్తలకు చేవూరు పిలుపు



రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేందుకు అర్హులైన వారంతా సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ కమిటి జిల్లా అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి పిలుపునిచ్చాడు. ఈ నెల 22వ తేదీన నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చేవూరు మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపోటములు ముఖ్యం కాదని, క్షేత్ర స్థాయిలో ప్రజల తరపున పోరాడడమే ధ్యేయంగా కార్యకర్తలు ఎన్నికలకు తయారుకావాలన్నాడు. జిల్లా, మండల, గ్రామ, వార్డు స్థాయిలలో ప్రజల అవసరాలు, సమస్యలు గుర్తిస్తూ నాయకులు, కార్యకర్తలు వాటిపై పోరాడాలన్నాడు. క్రమశిక్షణతో ప్రజల కోసం శ్రమించే ప్రతి కార్యకర్తను కాంగ్రెస్‌పార్టీ గుర్తిస్తుందన్నాడు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాలకు పూలదండలు వేసినంత మాత్రాన దేశభక్తులు కాలేరని, ఆయన సూచించిన మార్గాన్ని అనుసరించిన వారే దేశభక్తులంటూ బీజేపీపై విమర్శలు చేశాడు. పౌరసత్వ బిల్లు విషయంలో కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని, సర్వమత సమ్మేళన భారతదేశాన్ని మతాలవారీగా విభజిస్తుందని ఆయన దుయ్యబట్టారు. ఏపి రాజధాని విషయంలో ముఖ్యమంత్రి అఖిలపక్షాల అభిప్రాయంతో పాటు రాష్ట్ర ప్రజల మనోభావాలను కూడా గుర్తిస్తే బాగుండేదన్నాడు.

ఈ సమావేశంలో మాజీఎమ్మెల్యే సి.వి.శేషారెడ్డి, కాంగ్రెస్ నాయకులు భవాని నాగేంద్రప్రసాద్, ఉడతా వెంకట్రావ్, చింతాల వెంకట్రావ్, షేక్ ఫయాజ్, పి.వెంకటేశ్వర్లు, చందనమూడి పెద ఈశ్వరయ్య, పూల చంద్రశేఖర్‌రావు, డి.రమేష్‌నాయుడు, సత్తెనపల్లి బాలయ్య, టి.బాలసుధాకర్, సర్ఫరాజ్, షబ్బీర్, ఏటూరు శ్రీనివాసులురెడ్డి, హుస్సేన్‌బాషా, ఏ.శ్రీనివాసులు, కొండా అనిల్ కుమార్, షేక్ అల్లావుద్దీన్, ఏ.మోహన్, ఎన్.మోహన్‌రెడ్డి, లతా రెడ్డి, అనురాధారెడ్డి, అమీనా, మంజుల, ఖాసిం, ప్రసాద్, కిషోర్, ఏ.రాంప్రసాద్, కరీముల్లా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.





నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు

Mayuri Restaurant
MULTICUISINE
Pogathota, Nellore
☎ 2357555, 8121313133

INDIAN
CHINESE
TANDOORI
MEALS
DUM BIRIYANIES
ICE-CREAMS
Carry Home
For HOME DELIVERY
CALL: 2336889
8125678222

We undertake OUT-DOOR CATERING @ 8121313133

Venkataramana Vilas
Padmavathi Fast Foods
HIGH QUALITY PURE VEGETARIAN
TIFFIN, COFFEE, MEALS, ICE-CREAMS
POGATHOTA, NELLORE. ☎ 2328659, 9949774423

### శ్మశానస్థలంలో
# పారిశుద్ధ్య చర్యలు


మాట్లాడుతున్న గోపాల్‌యాదవ్, శ్రీకంటి రామ్మోహన్‌రావు

గూడూరు రెండవ పట్టణంలోని శ్మశానస్థలంలో పెరిగిన పిచ్చిచెట్లు, అపరిశుభ్రతను వైకాపా నాయకులు వీరిబోయిన గోపాలకృష్ణ మరియు గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం గౌరవాధ్యక్షుడు, ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో తొలగించారు. ఈనెల 22న జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కొన్నేళ్ళుగా తమ ఆధ్వర్యంలో శ్మశానస్థలంలో తగు వసతులు సమకూరుస్తున్నట్లు చెప్పారు. యంత్రంతో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నామన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# అతిక్రమిస్తే.. కఠిన చర్యలు


వాహనాల ధృవపత్రాలను పరిశీలిస్తున్న ఆర్టీఓ మల్లికార్జున్‌రెడ్డి

వాహనదారులు సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని గూడూరు ఆర్టీఓ మల్లికార్జున్‌రెడ్డి హెచ్చరించారు. గూడూరు ప్రాంతంలో రవాణాశాఖ అధికారులు మురళీమోహన్, శేషురెడ్డితో కలసి ఈనెల 24న ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లు, ఇతర వాహనాలపై దాడులు నిర్వహించి లక్ష రూపాయల అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలను పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.



# పద్ధతి మార్చుకోండి...

### రౌడీషీటర్లకు గూడూరు పోలీస్ ఘాటు హెచ్చరిక

రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకోవాలని, సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందాలని, ప్రవర్తన మార్చుకోకుంటే కఠినచర్యలు తప్పవని గూడూరు డిఎస్పీ శ్రీభవానిహర్ష హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని ద్వారకామాయి ఫంక్షన్‌హాల్‌లో పంచాయతీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో గూడూరు డివిజన్‌లోని రౌడీషీటర్లకు ఈనెల 22న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు మంచిప్రవర్తనతో మెలిగి కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలన్నారు. సిఐలు దశరథ రామిరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ నేరాల విచారణలో సాంకేతికత అభివృద్ధి చెందిందని, ఎవరు ఎక్కడ ఏ నేరం చేసినా తెలిసిపోతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఆదిలక్ష్మి, హుస్సేన్‌బాషా, పుల్లారావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలతో
# మానసికోల్లాసం

- డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి



కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ జనార్దన్‌రెడ్డి తదితరులు

క్రీడలతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడమేకాక ఉల్లాసంగా ఉంటారని గూడూరు పట్టణ వైద్యులు డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదిశేషారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ మైదానంలో రోటరీ క్లబ్, రోటరీ వెస్ట్ ఫర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 24న కబడ్డీ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి ఆదిశేషారెడ్డి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జానకి రామిరెడ్డి, మునిరాజా, దశరథరామిరెడ్డి, కెఆర్ రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


### గణితంపై
# ఆసక్తి అవసరం


గాదంశెట్టి గౌతమికి బహుమతిని అందజేస్తున్న గురుగుహ తదితరులు

ప్రఖ్యాత గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని గూడూరు పట్టణ సమీపంలోని తిలక్‌నగర్ సింహపురి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలైన గాదంశెట్టి గౌతమి తదితరులకు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు సాయిసురేష్‌బాబు మాట్లాడుతూ గణితంపై విద్యార్థులందరూ ఆసక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురుగుహ, రాణి మాలిని దేవి, దయాకర్, శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ ఎస్టీ కమిటీ
# సభ్యుల ఎంపిక

గూడూరు సబ్‌డివిజన్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా గూడూరు పట్టణానికి చెందిన అరవ పార్వతయ్య, సయ్యద్ తాజుద్దీన్, శ్రీనివాసులు, రత్నం ఎంపికయ్యారు. ఆ మేరకు మంగళవారం వారు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. గూడూరు సబ్ కలెక్టర్ గోపాలకృష్ణకు వారు తమ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

శ్రీను గల్పిక

# అమరావతికి రాజధానిని తెచ్చిన లోకేష్

తాడేపల్లిలోని ముఖ్యమంత్రి, నవరత్న వైయస్ జగన్మోహన్‌రెడ్డి నివాసం. ఆరోజు డిసెంబర్ 21... సీఎం జన్మదినోత్సవం. ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, విజయసాయిరెడ్డి, టిడిడి ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు సుచరిత, కొడాలి నాని, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆళ్ల రామకృష్ణారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అంబటి రాంబాబు, ఆర్‌కె రోజా వంటి వాళ్లంతా వున్నారు. సీఎం కూర్చునే కుర్చీ ముందు టేబుల్‌పై అప్పుడే ఒక పెద్ద కేక్ తెచ్చిపెట్టారు. అది ఆంధ్రప్రదేశ్ మ్యాప్ రూపంలో వుంది. దాంట్లో విశాఖ, అమరావతి, కర్నూలు... మూడు ప్రాంతాలకు మూడు రంగులు వేసి పెట్టారు. జగన్ మూడు పార్ట్‌లుగా ఆ కేక్‌ను కట్ చేశాడు. అందరూ చప్పట్లు కొట్టారు. తర్వాత జగన్ వుండి... ఈ కేక్ ఎంత తియ్యగా వుందో, మన మూడు రాజధానుల అభివృద్ధి కూడా అంతే తియ్యగా వుండాలని చెప్పాడు. అంతలో అక్కడకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు వచ్చి... సార్, మీరు ప్రకటించిన మూడు రాజధానులకు వ్యతిరేకంగా అమరావతిలో రైతులు పెద్దఎత్తున ఆందోళన చేస్తున్నారు. రోడ్ల మీదే వంటా వార్పు చేస్తూ టైర్లు తగలబెడుతున్నారు. రేపు లోకేష్ కూడా ఈ ఉద్యమంలోకి దిగబోతున్నాడట... ఆయన దిగితే ఇంకెంత తీవ్రమవుతుందోనని చెప్పాడు. దానికి జగన్.. లోకేష్ దిగితే మనం ఆ ఆందోళనలను గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదు.. అని చెప్పి అక్కడ నుండి లేచాడు.

★★★★★

గుంటూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం. చంద్రబాబుతో పాటు లోకేష్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిమ్మల రామానాయుడు, ధూళిపాళ నరేంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, అచ్చెన్నాయుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ తదితరులున్నారు. చంద్రబాబు ఆవేశంగా... ఈ జగన్మోహన్‌రెడ్డి ఒట్టి తిక్కలోడులాగున్నాడు. ఒక్క రాజధానిని ప్రకటించడానికే మనమెంత సీన్ చేశాము. ఒక కమిటీని వేశాము, ఇల్లిల్లు తిరిగి రైతుల పొలాల పాస్‌బుక్‌లు తీసుకున్నాం, మన నారాయణ, పత్తిపాటి పుల్లారావులు పోటీలు పడి ట్రాక్టర్లతో పొలాలు దున్నేశారు, రాజధాని పేరు చెప్పుకుని 20 దేశాలు తిరిగాము, అయిదారు దేశాలకు చెందిన కంపెనీలను రాజధాని కాంట్రాక్ట్ ఇస్తామని పిలిపించాము, వందల కోట్లు ఖర్చుతో రాజధాని గ్రాఫిక్ డిజైన్‌లు గీయించాము. మేము ఇంత కష్టపడి డిజైన్‌లు గీయిస్తే ఆ జగన్ ఒకే ఒక్క మాటతో నా శ్రమనంతా బూడిదలో పోసిన పన్నీరు చేశాడు... అని అంటుండగా, పత్తిపాటి పుల్లారావు లేచి... మీ శ్రమ కాదు సార్, రాజధాని వస్తుందని చెప్పి కోట్లు పెట్టి భూములు కొన్నోళ్లంతా ఇప్పుడు నెత్తిన గుడ్డేసుకునే పరిస్థితి వచ్చింది. ఆ జేసీ దివాకర్‌రెడ్డి చెప్పినట్లు రాజశేఖరరెడ్డిని నమ్మి చెడిపోయినోడు లేడు, మిమ్మల్ని నమ్మి బాగుపడ్డోడు లేడు... అది ఇప్పుడు ఇంకోసారి ఋజువయ్యేటట్లుందన్నాడు. వెంటనే దేవినేని ఉమ ఉండి... మనం ఇక్కడ ఎన్ని అనుకున్నా లాభం లేదు, అమరావతి ప్రాంతంలో రైతులను రెచ్చగొడితేనన్నా కొంత ఫలితం ఉంటుంది. అందరం అక్కడకు పోదాం పదండి అని చెప్పాడు.

★★★★★

అమరావతిలోని తుళ్లూరు, మందడం, ఉద్దండరాయపురం ప్రాంతాలను కలిపే పెద్ద జంక్షన్. చంద్రబాబు, లోకేష్, దేవినేని ఉమ, నారాయణలు ఆ గ్రామాలలో ఇల్లిల్లు తిరిగి అమరావతిని రాజధానిగా నిలబెట్టుకోవాలంటే ఉద్యమం చేయాల్సిందేనంటూ రెచ్చగొట్టి రైతులను రోడ్డు మీదకు తెచ్చారు. వేలమంది రైతులు అక్కడ పోగయ్యారు. రోడ్డుకు అడ్డంగా టైర్లు కాల్చారు... లోకేష్ అయితే రైతులకు నాయకత్వం వహిస్తూ అమరావతి రాజధానిని మనం కాపాడుకోవాలి... ప్రభుత్వం వెనక్కు తగ్గేదాకా మనం పోరాటం ఆపకూడదు... అంతవరకు నేను పచ్చి మంచినీళ్లు కూడా ముట్టను అని అన్నాడు. అంతలో పక్కనే వున్న గన్‌మెన్ ఒక గ్లాస్ చేతికిచ్చి తాగండి సార్ అని అన్నాడు... ఇప్పుడే కదా అమరావతి రాజధానిపై ప్రభుత్వం మెడలు వంచేదాకా పచ్చి గంగ కూడా ముట్టనన్నాను అని లోకేష్ చెప్పగా... ఇవి మంచినీళ్లు కాద్సార్, తియ్యటి లస్సీ అని సెక్యూరిటీ చెప్పాడు. అలాగైతే ఓకే అంటూ లోకేష్ ఆ లస్సీని గటగట తాగేశాడు. అంతలో సచివాలయంకు బయల్దేరిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కాన్వాయ్ అక్కడకు వచ్చింది. లోకేష్ నాయకత్వంలో రైతులంతా కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. జగన్‌తో పాటు మంత్రులు కూడా కార్లు దిగారు. సమస్య ఏంటని జగన్ లోకేష్‌ను అడిగాడు. దానికి లోకేష్... పొద్దున్నే పొట్టంతా రాయిలా బిగించుకున్నట్లుంటుందన్నాడు. అది నాకెందుకు చెబుతున్నారని జగన్ అడిగాడు. నువ్వే కదా, నీ సమస్య ఏంటో చెప్పమన్నావ్, నాకున్న ప్రధాన సమస్య అదే కాబట్టి చెప్పానని లోకేష్ అన్నాడు. జగన్ వస్తున్న నవ్వును ఆపుకుని... సమస్యంటే నీకున్న అజీర్తి సమస్య కాదు, ఇక్కడ మమ్మల్ని ఆపడానికి వున్న సమస్య ఏంటని అన్నాడు. అందుకు లోకేష్... రమారమి 20దేశాలు తిరిగి చంద్రబాబు గారు అమరావతిని రాజధానిగా ప్రకటించారు. ఈ రాజధానిని మారిస్తే మేము ఒప్పుకోము... అమరావతే రాజధానిగా ఉంటుందని చెప్పేదాకా మిమ్మల్ని ముందుకు పోనీయం... అసలు ఈ ప్రాంతంలోనే మిమ్మల్ని అడుగు పెట్టనీయం అని ఆవేశంగా అన్నాడు. అప్పుడు జగన్... ఇంకా మంచిది.. ఇక్కడ మీరు ఎవర్నంటే వాళ్లను అడుగు పెట్టనీయరని తెలిసే పరిపాలన రాజధానిని వైజాగ్‌లో పెట్టాను, కనీసం అసెంబ్లీనన్నా ఇక్కడ పెడదామనుకున్నాను, ఇక మమ్మల్ని ఇక్కడ అడుగు పెట్టనివ్వనిదానికి ఇక్కడ అసెంబ్లీ మాత్రం ఎందుకు, దానిని కూడా ఏ విజయనగరంలోనో, నెల్లూరులోనో పెట్టుకుంటాంలే అని చెప్పి కారెక్కి అక్కడనుండి కదిలాడు. లోకేష్ నిర్వాకం వల్ల వున్నది కూడా పోతుందనిచెప్పి రైతులు అతనిపైనే తిరగబడ్డారు. నీవల్ల అసెంబ్లీ కూడా లేకుండా పోయిందంటూ ఆవేశంగా అతనిపైకి లేచారు. లోకేష్ వారిని సముదాయిస్తూ... మీకిప్పుడేం కావాలి.. రాజధానే కదా అని అడిగాడు. 'అవును' అంటూ రైతులు చెప్పారు. అరగంట వెయిట్ చేయండి అంటూ లోకేష్ అక్కడ నుండి లేచి వెళ్లిపోయాడు. ఓ అరగంట తర్వాత ఒక బస్సు వచ్చి అక్కడ ఆగింది. అందులో నుండి లోకేష్ దిగాడు. ఏంటిది అని ఒక రైతు అడిగాడు. మీ కోసం 'రాజధాని' తెచ్చాను అని లోకేష్ చెప్పాడు. ఎక్కడా అని వారంతా అడిగారు. ఇదిగో అంటూ లోకేష్ బస్సు వైపు చూపించాడు. దానిపైన 'రాజధాని ఎక్స్‌ప్రెస్' అని వ్రాసి వుంది. అది చదివి రైతులు వెంటనే చేతుల్లోకి కర్రలు తీసుకున్నారు. ప్రమాదాన్ని పసిగట్టిన లోకేష్ అక్కడనుండి పరుగందుకున్నాడు.


## నూతన సంవత్సర శుభాకాంక్షలు

కళ్ళజోడులకు, కాంటాక్ట్ లెన్సులకు గుడ్ బై చెప్పండి




Dr. P. L. రావు గారు
ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన
FEMTOSECOND iLASIK తో
BLADE-FREE లాసిక్ లేజర్

అత్యాధునిక కాటరాక్ట్ ఆపరేషన్ కి సరికొత్త నిర్వచనం




Dr. O. గోపాలకృష్ణ గారు
ఆంధ్రప్రదేశ్ లో మొట్టమొదటి సారిగా
CATALYS Precision Laser System ద్వారా
లేజర్ కాటరాక్ట్ సర్జరీ

MODERN EYE HOSPITAL A MISSION FOR VISION

మాడరన్ 'ఐ' హాస్పిటల్ & రీసెర్చ్ సెంటర్
16-11-101, వెంకటరమణ హోటల్ పక్కవీధి, పొగతోట, నెల్లూరు
ఫోన్ - 0861 2324868, 2306015 || web : www.moderneyehospital.org

PATIENT SAFETY & QUALITY OF CARE NABH ACCREDITED


## నేదురుమల్లి ఆధ్వర్యంలో

# విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


చిన్నారులతో కలిసి కేక్‌ను కట్ చేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వెంకటగిరి బాలసదన్‌లోని విద్యార్థులకు ఈనెల 21న దుప్పట్లు, పరీక్ష సామగ్రిని ఒంగోలు, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గాల వైయస్సార్‌సీపీ పరిశీలకులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ సీఎం ప్రారంభించిన వైయస్సార్ నేతన్న నేస్తం పథకం చరిత్రాత్మకమన్నారు. రాష్ట్రంలోని 81 వేల చేనేత కార్మికుల కుటుంబాలకు రూ.24వేల వంతున సాయం అందజేశారన్నారు. గత 40 ఏళ్ళుగా వెంకటగిరి నేతన్నలతో నేదురుమల్లి కుటుంబానికి అనుబంధం ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి చేనేత కార్మికులు అండగా నిలవాలని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్సార్ సీపీకి బ్రహ్మరథం పట్టాలని కోరారు. అనంతరం రాజా కుటుంబీకులు సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్రలను రాజా ప్యాలెస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పోలేరమ్మ ఆలయ మాజీ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ పులి ప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ రీజినల్ మాజీఛైర్మన్ చెలికం శంకర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పాదిలేటి దశరథరామిరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


2020

## శుభాకాంక్షలు

మా అభివృద్ధికి కారకులైన
శ్రీ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారి ఆశీస్సులతో
వారి కుటుంబసభ్యుల సహకారంతో
మాకు అండగా నిలుస్తూ, అనునిత్యం ప్రోత్సహిస్తూ...
వ్యాపారంలో మమ్మల్ని ముందుకు నడిపిస్తున్న
మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు
2020 నూతన సంవత్సర మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు.



- షేక్ రియాజ్‌బాషా

RIYAZ
Hyderabad Lighting House & Hirers
All varieties of Calcutta Pandals & Green Mats
C.P.R Kalyana Mandapam, Magunta Layout, Nellore - 3.
Cell: 93464 55212, 94402 76032

## కల్యాణ వైభవం...!




కొడవలూరు మండలం బసవాయపాళెం వాస్తవ్యులు నల్లారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి - భారతిల కుమారుడు **సనత్‌శేఖర్‌రెడ్డి - లక్ష్మీమౌనిక** (మహబూబ్ నగర్ వాస్తవ్యులు పి.వెంకట్‌రెడ్డి - ఇందిరల కుమార్తె)ల కల్యాణం డిసెంబర్ 6వ తేదీ తిరుపతిలోని ఫార్చ్యూన్ కెన్సస్ హోటల్ నందు జరిగింది.
వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# అస్తవ్యస్థ విధానాలతో వ్యవస్థలు ధ్వంసం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సోమిరెడ్డి, పక్కన బీద రవిచంద్ర

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అస్తవ్యస్థ విధానాలతో రాష్ట్రంలో ఒక్కో రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాడని మాజీమంత్రి తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించాడు. 26వ తేదీ నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిపిఏలపై పునఃసమీక్షల పేరుతో సాంప్రదాయ విద్యుత్ వనరులైన సోలార్, విండ్ పవర్ రంగాలలో గందరగోళం సృష్టించిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు థర్మల్ పవర్‌ను కూడా భ్రష్టు పట్టించాలని చూస్తున్నాడని విమర్శించాడు. నందమూరి తారకరామారావు, చంద్రబాబునాయుడు, వైయస్ రాజశేఖరరెడ్డిలు ఎంతో ప్రత్యేకశ్రద్ధ పెట్టి అభివృద్ధి చేసిన రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఎన్‌టిపిసికి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అలాగే నెల్లూరుజిల్లా నేలటూరులో వున్న ఏపి జెన్‌కో పవర్ ప్రాజెక్ట్‌ను కూడా ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తోందని, ఈ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశాడు.

ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర కూడా పాల్గొన్నాడు.

# అంతా బాబే చేశాడు!

(మొదటి పేజీ తరువాయి)

ఖచ్చితంగా మాజీముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే! అమరావతి ప్రాంత రైతులలో లేనిపోని ఆశలు కల్పించింది, చివరకు ఆ ఆశలను సమాధి అయ్యేలా చేసింది చంద్రబాబునాయుడే! 2014 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో ఒక క్లియర్ పిక్చర్ వుండేది. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ పదేళ్ళు ఉమ్మడి రాజధాని అయినప్పటికీ ఏపికి కొత్త రాజధాని మాత్రం అప్పుడు అధికారంలోకి వచ్చే ప్రభుత్వ నిర్ణయం మీద ఆధారపడి వుంటుందనే అభిప్రాయం వుండేది. తెలుగుదేశం అధికారంలోకి వస్తే రాజధాని విజయవాడ – గుంటూరుల మధ్య వుంటుందని, వైసిపి అధికారంలోకి వస్తే ప్రకాశం జిల్లా దొనకొండ రాజధాని అయ్యే అవకాశముందని అప్పట్లోనే స్పష్టత వుంది. ఈ నేపథ్యంలోనే 2014 ఎన్నికల్లో తెలుగుదేశం అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిని రాజధానిగా ఎంచుకోవడం జరిగాయి. అయితే అమరావతి రాజధాని నిర్ణయాన్ని అప్పుడే చాలామంది మేధావులు వ్యతిరేకించినా చంద్రబాబు పట్టించుకోలేదు. అమరావతి రాజధానిపై ఆయన తన సొంత ప్రణాళిక రూపొందించుకున్నాడు. రైతుల నుండి 33వేల ఎకరాల భూమిని సేకరించాడు. ఇన్నివేల ఎకరాల భూమినైతే పెద్ద గందరగోళం లేకుండా సేకరించగలిగారుగాని, దానిని ఒక క్రమ పద్ధతిలో సద్వినియోగం చేసుకోలేకపోయారు. ఇన్ని వేల ఎకరాల భూములను రియల్ ఎస్టేట్ కోణంలో ఆలోచించారు. దీని నుండి ఎంతో సొంత లాభాలను ఆశించారు. ప్రపంచంలోని అన్ని ప్రధాన నగరాలను ప్రస్తావించి అమరావతిని వాటిలాగా చేస్తామన్నారు. చంద్రబాబు సీఎంగా వున్న ఐదేళ్లలో రాజధానిపైనే 80శాతం దృష్టిపెట్టారు. కాని రాజధానికి ఒక రూపం తేలేకపోయారు. ఐదేళ్లలో ఒక్కటీ శాశ్వత భవనం కట్టలేకపోయారు. ఆయన ఏదో చేద్దామనుకుంటే ఇక్కడ ఇంకేదో అయ్యింది. అదే చంద్రబాబు రైతుల నుండి కేవలం 5వేల ఎకరాలు మాత్రమే తీసుకుని ఆ ఐదేళ్లలో అక్కడ శాశ్వత భవనాలు కట్టి, ఉద్యోగులందరికీ అక్కడే స్థిర నివాసం వుండేలా చేసి, రాజధాని పరిసర ప్రాంతాలన్నింటినీ కలిపి ఒక మాస్టర్‌ప్లాన్ గీయించివుంటే పరిపాలనా రాజధాని అక్కడే ఫిక్స్ అయ్యుండేది. ఈరోజు జగన్మోహన్‌రెడ్డి కదిలించడానికి అవకాశముండేదికాదు. చంద్రబాబు రాజధాని విషయంలో చేసిన నిర్వాకాల వల్లే ఈరోజు జగన్‌కు రాజధానిని మార్చుకోవడానికి అవకాశమొచ్చింది. చంద్రబాబు విధానాల వల్లే ఈరోజు అమరావతి రైతులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది.

## వికేంద్రీకరణ మాట

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్‌నారాయణ్ కూడా జైకొట్టాడు. ఆయన బహిరంగంగానే మూడు ప్రాంతాలలో రాజధానుల నిర్ణయాన్ని సమర్ధించాడు.

బీజేపీ, సీపీఎం వంటి పక్షాల నాయకులు కూడా పరిపాలన వికేంద్రీకరణను వ్యతిరేకిస్తున్నారేగాని, అభివృద్ధి వికేంద్రీకరణను కాదు. రాజధానుల విషయంలో ప్రభుత్వంపై పెద్దఎత్తున వ్యతిరేకత వస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతాయని, వైసిపి ప్రభుత్వం ఆత్మ రక్షణలో పడుతుందని తెలుగుదేశం శ్రేణులు భావించాయి. తీరాచూస్తే ఒక్క అమరావతి పరిసర గ్రామాలలో తప్పితే ఎక్కడా దీనిపై నిరసనలు వ్యక్తం కావడం లేదు. ఆఖరకు గుంటూరు, కృష్ణా జిల్లాల్లో కూడా ప్రశాంతంగానే వుంది. విశాఖ పట్నంను పరిపాలన రాజధాని చేయడంతో ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి వాళ్ళు, కర్నూలుకు హైకోర్టును ఇవ్వడంతో రాయలసీమవాళ్ళు హ్యాపీగానే వున్నారు. రాజధాని మార్పు ఏడుపు మిగిలిందంతా కూడా చంద్రబాబు అండ్ కోకే...!

## కదులుతున్న రామాయపట్నం

(5వ పేజీ తరువాయి)

శంకుస్థాపన చేసింది. అయితే అది ఎన్నికలలో లబ్ది కోసం చేసిన శంకుస్థాపనే కాని చిత్తశుద్ధితో పోర్టును నిర్మించాలని చేసింది మాత్రం కాదు. ఇప్పుడు అధికారంలో వున్న వైసిపి ప్రభుత్వం మాత్రం రామాయపట్నం పోర్టుపై చిత్తశుద్ధి ప్రయత్నాలు మొదలుపెట్టింది. కేంద్ర ప్రభుత్వ సారధ్యంలోనే పెద్దపోర్టును నిర్మించాలని భావిస్తోంది. అభివృద్ధి వికేంద్రీకరణలో ప్రకాశం – నెల్లూరుజిల్లాలకు ప్రాధాన్యతనిచ్చే క్రమంలో రామాయపట్నం పోర్టును ఏర్పాటు చేయడం ద్వారా ఈ రెండు జిల్లాలకు న్యాయం చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం.

ఇటీవలకాలంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి, కందుకూరు శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎం.మహీధర్‌రెడ్డిలు కూడా రామాయపట్నం పోర్టును సాధించడానికి తమ ప్రయత్నాలు కూడా ముమ్మరం చేశారు.

## రెడ్‌క్రాస్ సమావేశం

నెల్లూరు జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షులు ఉత్తర్వుల మేరకు 2020 ఫిబ్రవరి 2వతేదీన జరుగవలసిన సమా వేశాన్ని 2020 జనవరి 5వతేదీ ఉదయం 11గంటలకు నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ వేంకటేశ్వర కస్తూరిబా కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ సంస్థ అడ్ హక్ కమిటీ ఛైర్మన్ ఏవి సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆయన పరిస్థితి ఏంటి?

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబునాయుడు తన నాలుగు దశాబ్దాల రాజకీయ చరిత్రలో ఎందరినో చూసుంటాడు, మహామహులను ఎదుర్కొని వుంటాడు. ఎన్టీఆర్‌లాంటి ప్రజాకర్షణ వున్న నేతనే పల్టీలు కొట్టించాడు. కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి, మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, కె.రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల వంటి ముఖ్యమంత్రులతో ప్రత్యర్థిగా నిలిచాడు.

అయితే ఆయన రాజకీయ జీవితంలో ఇలాంటి వాళ్ళు నాకెందుకు తగిలారురా అని బాధపడేలా ఆయనకు చుక్కలు చూపించిన నాయకులు ఇద్దరే ఇద్దరు. వారిద్దరూ తండ్రీ కొడుకులే! అప్పుడు వైయస్ రాజశేఖరరెడ్డి, ఇప్పుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి. చంద్రబాబుకు ఆయన రాజకీయ జీవితంలో గడ్డు రోజులను చవిచూసేలా చేసింది, మానసికంగా ధైర్యం కోల్పోయేలా చేసింది కూడా ఈ ఇద్దరే! రాజకీయంగా చంద్రబాబును ఓడించింది కూడా ఈ ఇద్దరే!

2004, 2009 ఎన్నికలలో వైయస్ రాజశేఖర రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీ రెండుసార్లు గెలిచి, చంద్రబాబును పదేళ్లపాటు అధికారానికి దూరంగా వుండేలా చేసింది. ఆ పదేళ్ళు అసెంబ్లీలో సైతం ప్రతిపక్ష నేతగా వున్న చంద్రబాబుకు సినిమా చూపించాడు రాజశేఖరరెడ్డి. అసెంబ్లీలో చంద్రబాబు లేచి ఒక ఆరోపణ చేస్తే, వెనువెంటనే వంద వేళ్లు ఆయనవైపు చూపించేవి. ఆయన గత పాలనలోని తప్పొప్పులను దుయ్యబట్టేవి.

ఇప్పుడు సేమ్ సీన్ రిపీట్ అయ్యింది. తన నాయకత్వంలో మరోసారి వైయస్ తనయుడు జగన్మోహన్ రెడ్డి చేతిలో ఓడిపోయిన ఆయన, ఇప్పుడు రాజశేఖర రెడ్డి హయాంలో కంటే ఎక్కువ ఎదురుదెబ్బలు తింటున్నాడు. జగన్‌కు చంద్రబాబంత రాజకీయ చాణక్యం, అనుభవం లేకపోయినప్పటికీ అయన వేస్తున్న ఎత్తుగడలకు బాబుకు దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అవుతోంది. చంద్రబాబును రాజకీయంగా ఓ ఆట ఆడుకోవడంలో జగన్ తన తండ్రిని మించిపోయాడు.

'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అన్నట్లుగా శాసనసభ సమావేశాలలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు గత ముఖ్యమంత్రిగా ఏ సాంప్రదాయమైతే అలవాటు చేశాడో అదే సాంప్రదాయాలు ఇప్పుడు ఆయనను వెంటాడి వేటాడాయి. మానసికంగా చిత్రవధ చేశాయి. ఆయన తప్పులను పదేపదే ఎత్తి చూపాయి. అధికారపక్షం దాడికి సరైన సమాధానాలు చెప్పలేక పైకి లేని నవ్వులు నవ్వుతూ లోపల మానసికంగా నలిగిపోతూ చిత్రవధ అనుభవించాడాయన!

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో సభా సాంప్రదాయాలను మంటగలిపిన వారిలో చంద్రబాబు మొదటి స్థానంలో వుంటాడు. 2014–19 మధ్య తన ఐదేళ్ల పరిపాలనాకాలంలో ఆయన అసెంబ్లీని తన పార్టీ ఆఫీసు క్రింద చూశాడు. యధేచ్ఛగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించాడు. స్పీకర్‌ను నిమిత్తమాత్రుడిగా చేశాడు. ఇక అసెంబ్లీ సమావేశాలలో చంద్రబాబు, ఆయన అనుచరగణం చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. ఆనాటి ప్రతిపక్ష నేత వైయస్ జగన్మోహన్‌రెడ్డిని ఏ కోర్టు కూడా దోషిగా నిర్ధారించలేదు. ఆయనపై వున్న ఆరోపణల మీద విచారణ పూర్తి కాలేదు, కాని ఈ కేసులను సాకుగా చూపి జగన్‌పై ఆనాడు అవాకులు చెవాకులు పేలారు. ఒక ప్రతిపక్ష నేతకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకుండా నోటికొచ్చినట్లు వాగారు. ఆనాడు చంద్రబాబు, అచ్చెన్నాయుడు, దేవినేని ఉమామహేశ్వరరావు, బోండా ఉమా, కాల్వ శ్రీనివాసులు వంటి వాళ్ళు మాట్లాడిన మాటలు చూస్తే... ఇక ఎల్లకాలం మేమే అధికారంలో వుంటామనే అతి నమ్మకంతో వాగినట్లుగా వుండేది.

ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని రకాల సవాళ్లను ఎదుర్కొన్నాడు. తనపై దాడిని సమర్ధవంతంగా తిప్పికొట్టాడు. మొండిగా నిలబడ్డాడు.

ఇప్పుడు ప్రతిపక్ష స్థానంలో చంద్రబాబు... ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి... అసెంబ్లీ సమావేశాలంటేనే బాబుకు వణుకొచ్చేలా చేశారు. అధికారపార్టీపై చంద్రబాబు ఒక్క రాయి విసిరితే, మరుక్షణమే ఆయనపై నూట యాభై రాళ్ళు పడ్డాయి. ప్రభుత్వంపై ఆయన ఒక్క విమర్శ చేస్తే వెనువెంటనే ఆయన్ను వంద నోర్లు ప్రశ్నించాయి. గత ఐదేళ్ల చంద్రబాబు పాలనలో అవినీతి, అక్రమాలను ఎండగడుతున్నాయి. కొందరు సభ్యులు ఇంకా ముందుకు పోయి ఆయన గారి గత పాలనా నిర్వాకాలను వీడియోల రూపంలో సభలోనే ప్రదర్శించడం చూశాం.

అటు సభలో, ఇటు బయట... చంద్రబాబు పరిస్థితి రోడ్డురోలర్ క్రింద పడ్డ కంకరరాయిలా మారింది. ముఖ్యంగా వైయస్ హయాంలోనైనా కొంచెం తట్టుకుని నిలబడ్డాడేమోగాని, ఇప్పుడు ఆయన తనయుడు జగన్ స్పీడుకు, ఆ దూకుడుకు చంద్రబాబు ఏ మాత్రం తట్టుకుని నిలబడే పరిస్థితుల్లో లేడు.

## డీకెడబ్ల్యూ అభివృద్ధికి కమిటీ

నెల్లూరులోని డీకెడబ్ల్యూ ప్రభుత్వ మహిళా కళాశాలకు నూతన కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సతీష్ చంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాలలో పరి పాలనపరమైన అంశాలపై నిర్ణయాలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఎడ్యుకేషనిస్టుగా మొయిళ్ళ గౌరి, ఇండస్ట్రియలిస్ట్‌గా ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ప్రొఫెషనల్‌గా కళాశాల ప్రిన్సిపల్ మస్తానయ్య, ప్రభుత్వ ప్రతినిధిగా కళాశాల విద్య స్పెషల్ కమిషనర్ సభ్యులుగా ఉన్నారు.

## అమరావతిని...
# నిర్వీర్యం చేసింది బాబే!
### - ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి




54వేల ఎకరాలు సేకరించి 5వేల కోట్లకు పైగానే ఖర్చుపెట్టి అమరావతిలో తాత్కాలిక భవనాలే తప్ప చంద్రబాబు నాయుడు అమరావతికేమి చేశారని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ప్రశ్నించాడు.

ఇటీవల ఆయన నెల్లూరులోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు ఆయన బినామీలు, అప్పటి మంత్రులు చట్టాలను కూడా మార్చేసి పేదల భూములను లాక్కున్నారని, మొత్తంగా అమరావతిని చంద్రబాబు నిర్వీర్యం చేశారని తీవ్రంగా దుయ్యబట్టారు. పదేళ్ళు హైదరాబాద్‌లో ఉండాల్సివున్నా దొంగలా ఎందుకు పారిపోయివచ్చారో చెప్పాలన్నారు. రాజమౌళి గ్రాఫిక్స్, బోయపాటి శ్రీను ఇచ్చిన సెట్టింగులతో ప్రజలను మభ్యపెట్టడం తప్ప చంద్రబాబు అమరావతికి చేసిందేమిటని ఆయన ప్రశ్నించారు. 40 ఏళ్ళ అనుభవం తనకుందని చెప్పుకునే చంద్రబాబుకు ఏవిధంగా మాట్లాడాలనే కనీస విజ్ఞత కూడా లేదన్నారు. పేదల కడుపుకొట్టి చంద్రబాబు, ఆయన బినామీలు అమరావతిలో పేదల భూములను లాక్కున్నారని, మూడు పంటలు పండే అమరావతిని మాజీ మంత్రులు పత్తిపాటి పుల్లారావు, నారాయణలు తమ ఇష్టానుసారం దున్నిపారేశారని, ప్రకృతిశాపమే వారికి తగిలిందని ఆనం విమర్శించారు. ప్రజల అభ్యున్నతికన్నా చంద్రబాబుకు తన అభివృద్ధే ముఖ్యమన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనం కోసమే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి 3 రాజధానులను ప్రకటించారన్నది తెలుసుకోకుండా ఇష్టానుసారంగా విమర్శలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. మూడు రాజధానుల విషయం పట్ల ప్రజల్లో అభ్యంతరాలేమీ లేకపోయినా చంద్రబాబు మాత్రం పెయిడ్ ఆర్టిస్టులతో విమర్శలు చేయిస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో రాష్ట్రంలోని ఏ ప్రాంతానికి అన్యాయం జరుగకుండా చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆనం రంగమయూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 1 నుండి
# ఆరోగ్యశ్రీ కొత్త కార్డులు

వైయస్సార్ ఆరోగ్యశ్రీ సేవలను పొందేందుకు ఆదాయ పరిమితిని ప్రభుత్వం భారీగా పెంచిందని ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ నాగార్జున ఈనెల 21న తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ది పొందేందుకు నూతన కార్డులు పొందిన లబ్దిదారుల వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రకటించినట్లు తెలిపారు. సచివాలయాల్లో ఆరోగ్యశ్రీ లబ్దిదారుల జాబితాను అందుబాటులో ఉంచుతామన్నారు. అర్హులు ఎవరైనా ఉంటే ఆరోగ్యశ్రీ కార్డుకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జనవరి 1 నుంచి ఆరోగ్యశ్రీ నూతన కార్డులను అందజేయనున్నామన్నారు.

## కార్యదర్శులు..
# మహిళలకు రక్షణ కల్పించాలి
### - జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్


మహిళా సంరక్షణ కార్యదర్శికి మెటీరియల్‌ను అందజేస్తున్న జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్

మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలని, సమాజంలో మహిళలు చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను నియంత్రించి వారికి పూర్తిస్థాయిలో రక్షణ కల్పించేందుకు మహిళా సంరక్షణ కార్యదర్శులు కృషిచేయాలని జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ అన్నారు. ఈనెల 23న నెల్లూరు చెముడుగుంటలో ఉన్న జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో జరిగిన రెండవ బ్యాచ్ గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శుల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా కార్యదర్శుల్లో ఎక్కువమంది ఉన్నత విద్యావంతులు కావడం అభినందనీయమన్నారు. కార్యదర్శులు మఫ్టీలో ఉన్న పోలీసులని అంటూ, కార్యదర్శులందరూ సమాజానికి కళ్ళు చెవులుగా వ్యవహరించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆకాంక్షలకు అనుగుణంగా కార్యదర్శులు తమ సేవలందించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, మద్యం అక్రమ నిల్వలు, విక్రయాల నియంత్రణలో తమదైనపాత్రను వారు పోషించాలన్నారు. జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, ఏఎస్పీ క్రైమ్స్ పి.మనోహర్‌రావు మాట్లాడుతూ తొలి బ్యాచ్‌లో 118 మంది శిక్షణ పొందారని, రెండవ బ్యాచ్‌లో 109 మంది శిక్షణ పొందుతున్నారన్నారు. ఐసిడిఎస్ పి.డి శేషకుమారి, డిటిసి వైస్ ప్రిన్సిపాల్ రవీంద్రరెడ్డి, ఆర్ఐ సురేష్, దర్గామిట్ట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగేశ్వరమ్మ, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరునగర వార్డుల
# సరిహద్దులు ఖరారు

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లకు సంబంధించిన హద్దుల పునర్విభజన ప్రక్రియను పూర్తి చేసి వివరాలను ప్రజల సందర్శనార్థం సంబంధిత కార్యాలయాల్లో ప్రదర్శిస్తున్నామని మునిసిపల్ కమిషనర్ పీవీవీయస్ మూర్తి ఈనెల 24న తెలిపారు. నగరపాలక సంస్థలో ఎన్నికలు నిర్వహించేందుకు అనుగుణంగా కమిషనర్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వుల మేరకు 2011 జనాభా లెక్కల ప్రకారం ముసాయిదా వివరాలను నగరపాలక సంస్థ కార్యాలయంతో పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయం, రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, నెల్లూరు రూరల్, అర్బన్ తహసీల్దార్ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శిస్తున్నామని తెలిపారు.

వార్డు హద్దుల పునర్విభజనకు సంబంధించి ప్రజలకు ఏమైనా అభ్యంతరాలున్నా, సలహాలు, సూచనలు చేయాలన్నా ఈనెల 30 వ తేదీ సాయంత్రం5 గంటలు లోగా నగరపాలక సంస్థ కార్యాలయంలో లేఖ ద్వారా తెలియజేయాలని సూచించారు.




డా|| సి.మధుసూదనరెడ్డి

జననం: 04.11.1950 మరణం: 31.12.2005

స్మృత్యంజలి

ఆత్మీయానుబంధాలను మాకు పంచి
చెదరని మీ చిరునవ్వును మాకు మిగిల్చి
మీరు మాకు దూరమై పద్నాలుగేళ్ళు గడవనున్నాయి.

మరపురాని మీ మధుర జ్ఞాపకాలతో...

భార్య:
డాక్టర్ చిట్టమూరు భారతి

కుమారుడు: చిట్టమూరు లోహిత్
కుమార్తె: చిట్టమూరు ప్రణీత
చెల్లెలు: నిర్మల
అల్లుడు: అరవింద్ దినకర్
బావ: డా|| సి.యం.కె.రెడ్డి
మరియు కుటుంబసభ్యులు



# సనాతన ధర్మ రక్షణకే శోభాయాత్ర

- వేమిరెడ్డి నివాసంలో శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతిస్వామి పూజలు
- చంద్రమౌళీశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పీఠపూజ
- వేమిరెడ్డి దంపతులతో పాటు..పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు

*శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ ఆశీస్సులతో చేపట్టిన హిందూ ధర్మప్రచార యాత్రలో భాగంగా ఈనెల 23న జిల్లాకు విచ్చేసిన విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీకి నెల్లూరులో ఘనంగా స్వాగతం లభించింది. జిల్లాలోని పలు ప్రముఖమైన ఆలయాలను స్వామీజీ దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 23 నుంచి 26 వరకు నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్వామీజీ ఆధ్వర్యంలో పీఠపూజ నిర్వహించారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు, ప్రముఖులు ఈ పూజల్లో పాల్గొని స్వామీజీ ఆశీస్సులను అందుకున్నారు.*



నెల్లూరుకు విచ్చేసిన విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీకి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఘనంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం సోమవారం రాత్రి మినీబైపాస్‌రోడ్డులోని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో రాజశ్యామల స్వరూప శారద చంద్రమౌళీశ్వరస్వామికి భక్తి శ్రద్ధలతో పీఠపూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ పూజలకు హాజరై స్వామివారి ఆశీస్సులను అందుకున్నారు.

## వేమిరెడ్డి దంపతుల గురుభక్తి అపారం

### - అభినందించి ఆశీర్వదించిన స్వామీజీ

ఈ సందర్భంగా నెల్లూరులోని ఎస్‌బిఐఎస్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ మాట్లాడుతూ దేశంలోని భిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు దేవాలయాలు ప్రతిబింబాలని అన్నారు. ఆధ్యాత్మిక చింతన కలిగిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి రెడ్డి దంపతులను స్వామీజీ ఈ సందర్భంగా అభినందించి ఆశీర్వదిస్తూ, వేమిరెడ్డి దంపతులకు ఉన్న గురుభక్తి అపారమైనదని అన్నారు. హైందవధర్మాన్ని పరిరక్షించాలన్న సంకల్పంతో తాము హిందూ ధర్మప్రచార యాత్ర నిర్వహిస్తున్నామని, కంచికామ కోటి పీఠాధిపతులు గతంలో చేపట్టిన విధంగా విశాఖ శారదా పీఠాధిపతి శ్రీ స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ యావత్‌భారతదేశం పర్యటించాలన్న సంకల్పంలో భాగంగా ముందుగా తెలంగాణలో, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్నామని, ఇప్పటిదాకా జరిగిన శోభాయాత్రలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 13వేల కిలోమీటర్ల దాకా పర్యటించి 250 ఆలయాలను దర్శించుకున్నామని అన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు

అనంతరం శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ నగరంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇ.ఓ, అర్చకులు స్వామీజీకి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ధర్మకర్తలమండలి ఛైర్మెన్ రత్నం జయరామ్, సభ్యులు తోట శోభారాణి, ఏలూరు శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రంగనాధస్వామిని దర్శించుకున్న స్వామీజీ

ఈనెల 24న శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ నెల్లూరు రంగనాయకులపేటలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాధ స్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఇ.ఓ వేమూరి గోపి, అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వామీజీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మం ఎంతో విశిష్టమైనదన్నారు. మన పురాతన ఆలయాల దర్శనం ఎంతో సంతోషం కలిగిస్తున్నదన్నారు. ఆలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్వామీజీ వెంట రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి రెడ్డి దంపతులు ఉన్నారు. అనంతరం స్వామీజీ విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విపిఆర్ విద్య స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులకు మంగళాశాసనాలు అందజేసి, వేమిరెడ్డి దంపతుల సేవలను అభినందిస్తూ ఆశీర్వదించారు. విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌ను, అక్కడున్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని, సాయిబాబా మందిరాన్ని దర్శించారు. అనంతరం వేమిరెడ్డి నివాసంలో చంద్రమౌళీశ్వర స్వామికి పీఠపూజలు నిర్వహించారు. ఆ తర్వాత స్వామీజీ జొన్నవాడలోని కామాక్షితాయి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. మంత్రి అనిల్ కుమార్ యాదవ్, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు స్వామీజీని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు.

# అభివృద్ధికి కలిసి కృషి చేస్తాం

### - మంత్రులిద్దరి మాట!



వెలుగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడం ద్వారా మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని సస్యశ్యామలం చేస్తామని జిల్లా మంత్రులు పి.అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డిలు ఉద్ఘాటించారు. గురువారం ఇద్దరు మంత్రులు కలిసి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. తొలుత సంగం బ్యారేజీని పరిశీలించారు. బ్యారేజీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మంత్రులిద్దరూ మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో జరిగిన సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అలాగే ఉదయగిరిలో ఏర్పాటు చేసిన పొదుపు గ్రూపు మహిళలకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగం, నెల్లూరు బ్యారేజీలను సెప్టెంబర్ నాటికి పూర్తిచేసి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తామన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్ పనులు కూడా త్వరలోనే పూర్తిచేసి ఉదయగిరికి సోమశిల జలాలను తరలిస్తామని హామీ ఇచ్చారు. నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు వారివెంట వున్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com